

బ్రహ్మదండి.

బ్రహ్మదండి. సాధారణముగ నన్ని నేలలలోను బెరుగును. ఇదియుం జిన్న మొక్కయె. గుల్మము.

ఆకులు:—ఒంటరిచేరిక తొడిమలేదు. పక్షివైఖరి తమ్మెలు గలవు. చ్ఛేదితము. తెల్లని చారలుగలవు పత్రములమీద ముండ్లున్నవి.

పుష్పమంజరి:—కణుపు సందులనుండి బయలుదేరును పువ్వులు సరాళము, సంపూర్ణము, పసుపుపచ్చనిరంగు.

పుష్పకోశము:—రక్షకపత్రములు రెండు నీచము ఆకుపచ్చరంగు.

దళవలయము:—4 ఆకర్షణ పత్రము వృంతాశ్రితము పసుపురంగు.

కింజల్కములు:—అసంఖ్యములు వృంతాశ్రితము.

అండకోశము:—అండాశయము ఉచ్చము 1 గది పెక్కు అండములు. కుడ్యసంయోగము కీలము పొట్టి కీలాగ్రము గుండ్రము.

ఈకుటుంబము చిన్నకుటుంబము. దీనిలోని మొక్కలన్నియు గుల్మములే. పెద్దచెట్లులేవు. ఈమొక్కలు కూడ మనదేశమందు తక్కువయె. ఆకులు ఒంటచేరిక, కణుపుపుచ్ఛములుండవు. పుష్పకోశపు తమ్మెలుగాని రక్షకపత్రములుగాని రెండును ఆకర్షణపత్రములు, కింజల్కములు నాల్గుచొప్పున నుండును. అండాశయము 1 గది.

ఈకుటుంబములోనికెల్ల గసగసాల మొక్కయె మిక్కిలి యుపయోగమైనది. వీనిపంటవలనఁ జాలలాభమువచ్చును. గసగసాల కాయిలనుండియే నల్లమందు చేయుదురు.

దీనిపంట ఎక్కువగా హిందూస్థానమునందుఁ గలదు. అచ్చట వరికోసి కుప్పలువేసిన తఱువాత గసగసాలను జల్లుటకై దున్నుట నారంభింతురు. పదిదినములకొకమాఱు చొప్పున నెలపదునైదుదినములవఱకు దున్నుచుందురు. వరికిఁ బనికివచ్చు నెఱువే దీనికినిబనికివచ్చును. ఇట్లెరువు వేయుచు దున్నిన పిదప నెనిమిదడుగులు పొడుగుగను నాలు గడుగులు వెడల్పుగను మళ్ళుచేయుదురు. గసగసాలనొక రాత్రి నీళ్ళలో నానఁబెట్టి ఈమళ్ళలో జల్లుదురు. అవి వారముదినములకు మొలకలెత్తును. 5. 6, అంగుళములెదిగిన తఱువాత నీరసముగా నున్నవని తోచినవానిని బెఱికివేయుటమంచిది. మఱికొంచమెదిగిన తరువాత మొక్కలు మిక్కిలి దగ్గరదగ్గరగానున్నవని తోచినయెడలఁ దీసి దూరముగాఁ బాతెదరు. తఱువాత, కాయలు కాచువఱకు నప్పుడప్పుడు నీరుబెట్టుచుండడలెను, ఈమొక్కలుమూడు నెలలలోనే ఎదిగి పుష్పించును. పుష్పించిన మూడవనాడు పువ్వులఱేకులను గోసివేయుదురు. తరువాత పదిదినములకుఁ గాయలు పెద్దవగును.

ఈకాయలనుండియే నల్లమందును జేయుదురు. కాయలుగోసిననాడో మఱునాడో మధ్యాహ్నమువేళ కాయల

నొక పనిముట్టుతో మనము ఆల్చిప్పతో మామిడికాయ గీసినట్లు గీయుదురు. (ఈపనిముట్టు నాలుగుకత్తులను మిక్కిలి దగ్గరదగ్గరగాఁ జేర్చినట్లుండును.) ఇట్లుగీసిన చాలలలో నొక ద్రవము చేరును. ఈద్రవమును నొక పాత్రలోనికిఁ జేర్చి నిలువచేయుదురు. ఇదియే నల్లమందు.

దీనిలో మఱియొక రసముగలిపిగాని కాయల పొప్పరవేసిగాని దగాచేయుచుందురు. కాని మఱియొక తైలము గలిపినను నల్లమందు నిలవయుంచగ నుంచగ నన్యపదార్థము పోయి మంచిదేయగును.

గసగసాలపంటయు నల్లమందు వ్యాపారమును చిరకాలమునుండి మనదేశమునఁ జరుగుచుండెను. అప్పటినుండియు చీనాదేశమునకె యెగుమతి యెక్కువగాఁ జేయుచున్నాము. బాబరుమొదలగు మొగలాయి చక్రవర్తుల కాలములో నల్లమందు మీఁదఁబన్నున్నట్లుఁ దెలియ వచ్చుటలేదు. డచ్చి, ఫ్రెంచి, ఇంగ్లీషువారలు మనదేశమునకు వర్తకమునకువచ్చిన తరువాత, మనవర్తకులవద్దఁ గొనుక్కొనుచు, నెగుమతిచేసికొనుచుండిరి. మనవర్తకులు రైతులకు సొమ్ము పెట్టుబడిపెట్టి తామిచ్చిన సొమ్మునకు బదులుగా నల్లమందును గైకొనుచుండిరి. మిగిలిన నల్లమందులో నేవో కలు

వుచు రైతులమ్ముకొనుచుండిరి. వీరిట్లు కల్తిగల్పుటచేతను ధరలలో హెచ్చుతగ్గులు వచ్చుటచేతను, యీయుల్లరిపడలేక ఈష్టు ఇండియాకంపెనివారు నల్లమందువ్యాపారము తామె భరింపవలసిన వారైరి. వారను హేస్టింగును వేలాములపద్ధతి పెట్టెను. దానిమూలమున నొకవర్తకుఁడొక పొలమును 4 వేలకో, 5 వేలకో వేలముపాడి "పండించు పండించు" మని రైతులను బాధపెట్టుచువచ్చెను. కాని రైతునకు లాభమంతగా నుండమిచే నిర్లక్ష్యముసేయుచు వచ్చె, వ్యాపారముతగ్గెను. ఇట్టి బాధలతగ్గించుటకై ఎట్టకేలకు గవర్నమెంటువారు నల్లమందు వ్యాపారమంతయుఁ దాము స్వయముగానే యంగీకరింపవలసినవారైరి. నల్లమందునకుఁ బ్రిమత్తునిజేయుగుణము గలదు. నూనె మొదలగు కొన్ని పదార్థములతోఁ దిన్నచో మరణమును సంభవించును. కనుక, మన శ్రేయస్సును గోరి గవర్నమెంటువారీనల్లమందునందఱికందనీయక దానిపై నెక్కువపన్ను విధించిరి. కాని నల్లమందుపై నెట్టినిబంధన లేకున్నను దానినిష్టపడి తినువారు ఇంగ్లాండుదేశములో మైమఱచి త్రాగుచున్న యంతమంది యుండరని గొందఱినమ్మకము. ఏదేమైనను మనమూలమున మనగవర్నమెంటువారికిఁ గలిగెడు లాభనష్టముల నెఱుంగుట మంచిది.

సంవత్సరము	1902-1903.	-03-04.	-04-05
నల్లమందు అమ్మకము వలన వచ్చిన సొమ్ము	రూ. 54939000	రూ. 70175566	రూ. 76133115
పైరుచేసి, నల్లమందుచేసి ఉండలు చేసినందులకు ఖర్చు.	9915495.	13070745.	11236875.

చైనా దేశస్థులిప్పుడు నల్లమందును నిషేధించుటచే మనవర్తకము తగ్గినది. అయినను ధరలెక్కువగనుండుటచే లాభము బాగుగనె వచ్చుచున్నది.

	1909-10.	10-11.	11-12.
పౌ	4424528.	6275305.	5231826.

నల్లమందును గడుపునొప్పి విరేచనములు కట్టుటకుఁ దఱుచుగా వాడుదురు. దానికి నితర యుపయోగములు గూడ గలవు. కొందఱు సదా భోజనమునకు ముందు మాత్రగా వేసికొందురు.

గసగసాలలో నీమత్తును గలుగఁ జేయు గుణములేదు. వానియందొక సువాసనయుఁ గలదు. నల్లమందు తీయ

ని కాయలలోని గింజలు మంచివి. ఈగింజలనుండి నూనెఁ దీయుదురు. దీనిని వంటలలోఁ గూడవాడుదురు. మఱియుఁ జిత్రపటములు వ్రాయుటయందును బనికివచ్చుచున్నది. గసగసాలను గొన్ని పిండివంటలలోను తాంబూలములోను గూడ వాడుదురు.

బ్రహ్మదండి:—మొక్క ఎక్కడనైన బెరిగిన నూడ బెఱికి పారవేయుచున్నారుగాని దానిలాభము గమనించుట లేదు. దానివాడుకయు నెందుచేతనో యంతగా లేదు. కాని గింజలనుండి తీసినచమురు, తలుపులకును బల్లలకును అన్నిచెక్కలకును మెఱుపుదెచ్చును. చిత్రపటములు వ్రాయుటలోను బనికివచ్చును. కొందఱు తలనొప్పిని గూడఁ బోగొట్టునందురు. ఈనూనె కడుపునొప్పులు మొదలగువానినిఁ బోగొట్టును. దీనియాకులరసము పుండ్లను మాన్పును.

నిజమైన బ్రహ్మదండిమొక్క వేరేయున్నదని కొందఱు చెప్పుచున్నారు.

ఆవకుటుంబము.



ఆవ.

ఆవమొక్క 4, 5 అడుగులెత్తు పెరుగును. కొమ్మలు గుబురుగా బయలుదేరును, నునుపుగానుండును గాని వాని మొదళ్లయందు తెల్లని ముండ్లుగలవు.

ఆకులు:—ఒంటరిచేరిక, లఘుపత్రిములు, అన్ని యాకులు నొకరీతిగలేవు. క్రిందుగానున్న యాకులు పెద్దవి. తొడిమలు పొడుగుగా నుండును. వానిమీఁదను ముండ్లుగలవు. పత్రిములకుఁ బెకుకైనమెత్తలుగలవు. పై యా

కులు చిన్నవి. తమ్మెలుతక్కువ. విషమరేఖ పత్రిము. అంచున ఱంపపు పండ్లున్నవి.

పుష్పమంజరి:—గెలలు కొమ్మలచివరలనుండి పుట్టును.

పుష్పకోశము:—సంయుక్తము 4, తమ్మెలు నీచము.

దళవలయము:—ఆకర్షణపత్రిములు 4, అధశ్చిర యండాకారము పాదముకలదు. పచ్చగానుండును వృంతము నంటియుండును.

కింజల్కములు:—6 కాడలు, ఆకర్షణ పత్రిములకంటెఁ బొడుగుగానున్నవి. పుప్పొడితిత్తులు రెండుగదులు.

అండకోశము:—అండాశయము ఉచ్చము. రెండుగదులు. గింజలవరుస ఒక్కొక్క గదిలో ఒక్కొక్కటిగలదు. కుడ్యసంయోగము, కీలము గుండ్రిముగాను పొట్టిగా నున్నది.

తెల్లఆవాలుమొక్క 3 మొ 5 అడుగులెత్తు పెరుగును. కొమ్మలు గుబురుగానుండవు.

ఆకులు ఒంటరిచేరిక, లఘుపత్రిములు, కొమ్మలనంటిపెట్టుకొని యుండును. క్రిందియాకులు పెద్దవి. తమ్మెలు గలవు. ఇవి ఒకదానికొకటిఎదురుగా నుండును. కొన్ని త్రిభుజాకారముగాను కొన్ని గుండ్రిముగా నుండును. పై యాకులు బల్లెపాకారము. రెండుపక్కల నున్నగా నుండును.

పుష్పమంజరి:—కొమ్మల చివరలనుండి గెలలు ఉపవృంతములు నున్నగా నున్నవి.

పుష్పకోశము:—సంయుక్తము 4 దంతములు, నీచము.

దళవలయము:—ఆకర్షణ పత్రిములు 4 అధశ్చిర అండాకారము. పాదముగలదు. వృంతము నంటియుండును, పసుపురంగు.

కింజల్కములు:—4. ఆకర్షణ పత్రిములు పాదముల కంటె రెండింతలు పొడుగు.

అండకోశము:—అండాశయము ఉచ్చము 2 గదులు, కీలము గుండ్రము. కాయ ద్వివిదారణ ఫలము.

ఆవకుటుంబపు మొక్కలు శీతలదేశమునందే కాని ఉష్ణదేశము లందంతగాఁ బెరుగఁ జాలవు. మనదేశములో నీకుటుంబపుమొక్కలు తక్కువ. వానిలోఁ జాలభాగము కొండలమీఁద నేగాని పెరుగవు. వీనిలో ఆకులు ఒంటరిచేరిక, విశేషముగా లఘుపత్రములు. రక్షకపత్రములు, ఆకర్షణపత్రములు నాలుగు, కింజల్కము లారుకంటె నెక్కువ యుండవు. ఆకర్షణపత్రములకుఁ బాదము గలదు, అండాశయమున రెండుగదులు గలవు.

మనదేశములోఁ బెరుగు నీకుటుంబపుమొక్కలలో నావమొక్కయే ముఖ్యమైనది. దీనిపంట మనరాష్ట్రమునకంటె హిందూస్థానమునం దెక్కువ కలదు. వరి, చెఱుకు పండు పల్లపుభూములలో నావాలు పెరుగఁజాలవు. వరికి నావశ్యకమయిన యుష్ణము ఆవాలకుఁ బనికిరాదు. వానిని విడిగానైనను, గోధుమల పొలములందైనను జల్లెదరు. విడిగాఁ జల్లునపుడెకరమునకు సేరున్నర, రెండుసేరుల విత్తులు గావలయును. పంట బాగున్నయెడల నారుమణుగులవఱకుఁ బండును. ఈ మొక్కలకుఁ దెగుళ్ళుపట్టుటయుఁ గలదు. కాని పంటపండిన

యెడల చాల లాభము వచ్చును. ఆవాలలో వర్ణఆవాలు పెద్దఆవాలు మాడుగొల్లు ఆవాలు, తెల్లఆవాలు, మొదలగు తెగలుగలవు. వీనిలో మొదటితెగయే శ్రేష్టము. తెల్ల ఆవా లౌషధమునందే కాని పోపులలో వాడము, ఆవాల నుంచి పిండిచేసి యమ్మెదురు. ఇట్టిపిండి ఐరోపాదేశ ము లందుండి కూడ వచ్చుచున్నది. మనదేశపు పిండికంటె నిదియే శ్రేష్టమందురు. భోజన మెక్కువైన బాధచెందుచుం డినగాని, తాగిపడియుండినగాని దీనిని కొంచెము దినినచో వాంతియై కడుపులోని మలినముపోయి బాధ తగ్గును. అ న్నముతోఁ బాటీపిండిని కొన్నిదినములు తినినయెడల జీర్ణ శక్తి కలిగి ఆకలి పుట్టును. కొన్నినొప్పులకు నావపిండిని ప ట్టువేసెదరు.

ముల్లంగి—మనదేశములోఁ జాలచోట్లఁ బెరుగును గాని మనమంతగా వాడమిచే దాని సేద్యము తక్కువగాను న్నది. వర్షములకు ముందఱ నేలను బాగుచేసి, కొన్నివాన లు కుఱియునప్పుడు గింజలను జల్లెదరు. తరువాత వానికి 6 దినముల కొకసారి తడి తగులుచుండవలెను. ఒకమాసము లోనే దుంపలెదిగి త్రివ్వుటకు సిద్ధముగానుండును. దుంపల కు నాకులకు నొకవిధమగు వాసనకలదు కాని కొందఱు దుంపలు ఆకులు కాయలుకూడ కూర వండుకొనెదరు. ఇది

వంటికిమంచిది. కడుపునొప్పివంటి బాధలను మూత్రవ్యాధులను గొంతతగ్గించును.



ఆడలువిత్తులు; పుష్పము.


అడలుగింజలు:—కూడ నౌషధములో నుపయోగపడుచున్నది. అవిదోసగింజలవలె నుండునుగాని కొంచెమెఱ్ఱగా నుండును. ఈగింజలను నూరిపట్టించినచోఁ గొన్నినొప్పులు తగ్గును. గింజలను నమిలి మ్రింగినగాని, పొడుముచేసి నీళ్ళలో గలిపి పుచ్చుకొనినగాని జిగటవిరేచనములు కట్టును.

"కేబేజి"—కూడ నీకుటుంబములోనిదె. ఈమొక్క అయిరోపాదేశస్థులతోడనే మనదేశమునకు వచ్చెను గాని తత్పూర్వము లేదు. ఇప్పుడైనను మనము తఱుచుగా దీనిని వండుకొనుటలేదు. మఱియుఁ గొప్పపట్టణములందుఁ దప్ప అన్నిచోట్ల దొరకదు. మనముకూరవండుకొను "కేబేజి" లేతయాకుల మొగ్గ.

వాయింట కుటుంబము.

వాయింటమొక్క—మూడడుగులెత్తువఱకుఁ బెరుగు నేకవార్షికపు గుల్మము. కొమ్మలకొక్కొక్కప్పుడు రంగుండును. లేఁగొమ్మలపై రోమములును జిగటయుఁ గలదు.

ఆకులు:—ఒంటరిచేరిక, మిశ్రమపత్రములు: తాళపత్రవైఖరి. అయిదు చిట్టియాకులుగలవు. చిట్టియాకులకుఁ దొడిమలేదు. అన్నియు సమముగానుండవు, సమాంచలము, కొనసన్నము, రెండువైపుల జిగురుజిగురుగా నుండు రోమములు గలవు. తొడిమపైఁ జిన్నచిన్న ముళ్ళవంటివి గలవు.




వాయింట.

పుష్పమంజరి:—కొమ్మలచివరలనుండి. గెలలు లేతవి గుత్తులవలె స[illegible]పించును. గెలలపైన ఆకులవంటి చేటికలు గలవు. వానిలో మూడేసిచిట్టి [illegible]ములున్నవి. అడుగుననున్నవాని కణుపుసందులలోఁ బువ్వులులేవుగాని

పైపానియందు గలవు. పుష్పములు చిన్నవి. ఉపవృంతము పొడుగానే యుండును.

పుష్పకోశము:—రక్షకపత్రములు 4. బల్లెపాకారము. జిగటగనుండు రోమములుగలవు.

దళవలయము:—ఆకర్షణపత్రములు నాలుగు. వీనికి నిడుపాటిపాదము గలదు. తెలుపు.



మావలింగము.

కింజల్కములు:—6. వృంతాగ్రము ఆకర్షణపత్రముల మధ్యనుండి పైకివచ్చియున్నది. దీనినే కింజల్కములంటుకొనియున్నవి.

అండకోశము:—అండాశయము ఉచ్చము. దీనికిని కింజల్కములకును మధ్య వృంతాగ్రము పొడుగుగ నేయున్నది. ఒకగది. అండములు చాల గలవు. కాయ ఎండిపగులును, కీలములేదు. కీలాగ్రము పెద్దది. దానిపైరంధ్రములు గలవు.

మావలింగముచెట్టు:—మనదేశపు పడమటి తీరమున విరివిగాఁ బెరుగుచున్నది గాని అంతటను దోటలందుఁ బెంచుచున్నారు. మార్గశిరప్రాంతముల నాకులురాలి వేసవికాలమందు ఆకులును బువ్వులును గలిసివచ్చును.

ఆకులు:—కొమ్మలచివర గుబురులుగానుండును. ఒంటరిచేరిక, మిశ్రమపత్రములు, మూడేసి చిట్టియాకులుగలవు. ఇవి అండాకారముగనైనను, సమగోళాకారముగనైనను బల్లెపాకారముగనైన నుండును. సమాంచలము. కొన వాలముగలదు. చిట్టియాకులకుఁ జిన్న తొడిమలుఁగలవు. అవి యతుకుపెట్టినట్లుండును.

పుష్పమంజరి:—కొమ్మలచివరలనుండి గుత్తులు.

పుష్పకోశము:—రక్షకపత్రములు నాలుగు. త్వరగ రాలిపోవును

దళవలయము:—ఆకర్షణ పత్రములుఁ నాలుగు. పాదములు గలదు. అధశ్ఛిర అండాకారము. కొంచము పసుపురంగుగ నుండును.

కింజల్కములు:—అసంఖ్యములు. కాఁడలు ఆకర్షణపత్రము లంత పొడవు.

అండకోశము:—అండాశయము ఉచ్చము. ఒకగది. దీనికివి కింజల్కముల మధ్యనుండివచ్చిన వృంతాగ్రముగలదు. కీలములేదు. ఆండములు రెండువరుసలు. కుడ్యసంయోగము. ఫలము కండకాయ.

ఈకుటుంబమునందు గుల్మములు. గుబురు మొక్కలు చెట్లును గలవు. ఆకులు ఒంటరిచేరిక, లఘుపత్రములుగాని తాళపత్రమై ఖరినున్న మిశ్రమపత్రములుగాని గలవు. కొన్నిటిలోఁ గణుపు పుచ్ఛములున్నవి; కొన్నిటిలో నవి ముళ్ళవలెమాఱియున్నవి. రక్షకపత్రములు, ఆకర్షణపత్రములు నాలుగేసి యుండును. సాధారణముగ గింజల్కము లెక్కువగా నుండును. అండాశయము ఒక జాతిమొక్కలందుఁ దప్ప మిగిలినవానియందుఁ గింజల్కములమధ్యనుండి పైకివచ్చిన వృంతాగ్రముపై నున్నది. అండములు రెండువరుసలు. కుడ్యసంయోగము. కీలము లేదు

వాయింటగింజలను ఆకులను వేరులను ఔషధములలో వాడెదరు. కడుపులోనుండి ఏలుగపాములు మొదలగు పురుగులను బోగొట్టుటకు గింజలను పొడుముచేసి పంచదారతో గలిపి పుచ్చుకొందురు. ఆకులరసము చెవిపోటునుబోఁగొట్టునుగాని చెవిమంట పెట్టును. వేరును ముక్కలుగాఁ గోసి కషాయముగాచి జ్వరమునకిత్తురు.

మావలింగము బెరడుతోఁ గషాయముగాచి మూత్రవిసర్జనమప్పుడు కలుగుమంట మొదలగు వ్యాధులకిత్తురు. ఆకులను నిమ్మకాయలరసముతో నూరిపట్టువేసినఁ గొన్ని చర్మవ్యాధులునుబోవును.

కుక్కవాయింట:—మొక్కలు పలుతావులఁ బెరుగుచున్నవి. ఆకులు మిశ్రమపత్రములు. పచ్చనిపువ్వులుబూయును. దీనిని వాయింటమొక్కవలెనే నుపయోగించుచు

న్నారు. ఈరెండు మొక్కలించుమించునొకరీతినే యుండును. కాని వానినీభేదములవలన గుర్తింపవచ్చును.



అరుదొండ.

కుక్కవాయింట పువ్వులు పచ్చగాను, కాయలు బల్ల బరువుగాను నుండును. దీనిపై జిగురుగానుండు రోమములు గలవు. కాయకుండు తొడిమ పొట్టిది; వాయింటపువ్వులు తెలుపు. కాయకొంచము గుండ్రముగానుండును. తొడిమ పొడుగు. కాయమీద రోమములు లేవు.

ఆరుదొండ:—దేనిపైనైనను నెగఁబ్రాకు గుబురు
మొక్క. దానికి ముళ్ళుగలవు. పువ్వులు కణుపుసందుదగ్గర
నొకదానిపై నొకటియుండును. దీనివేరు, ఆకుల కషాయ
ము డోకులను కట్టించును. అన్నహితవును గలుగఁజేయును.

పలికి:—చిన్నగుబురుమొక్క. కణుపుపుచ్ఛములు ము
ళ్ళవలె మాఱియున్నవి. ఆకులు లఘుపత్రములు; పువ్వులు
పచ్చగనుండును.

పట్టతీఁగె:—కొండలమీఁదఁ బెరుగు పెద్దతీఁగె.
ముళ్ళులేవు. ఆకులు అండాకారము. పువ్వులు పెద్దవి. కింజ
ల్కములు చాలకలవు. కాయ కండకాయ.

అగుబ:—తీఁగె అడవులలోఁ బెరుగును, దీనికి ము
ళ్ళుగలవు. పువ్వులు తెల్లగనుండును. పచ్చని చాఱలును
గలవు.

గులి:—చిన్నచెట్టు, ముళ్ళుగలవు, దీనికలపయు గట్టి
గానుండును.

సీరద కుటుంబము.

ఇదియొక చిన్నకుటుంబము. దీనిలోఁ పెద్దచెట్లు గుబు
రు మొక్కలునుగలవు. ఆకులు లఘుపత్రములు, ఒంటరి చే



కురంగవాము.

రిక, కొన్నిటి పువ్వులు మిథునపుష్పములు. కొన్నిటిలో నే కలింగ పుష్పములును గలవు. తఱుచు నీపువ్వులకు ఆకర్షణ పత్రములుండవు. కింజల్కములు చాలగలవు. విత్తనముల లో అంకురచ్ఛదనము గలదు.

నీరద చెట్లు:—దక్షిణ హిందూదేశమునందును మల బారు నందును విరివిగా నున్నవి. దీని గింజలు ముప్పాతిక అంగుళము పొడుగు, అరంగుళము వెడల్పు ఉండును. ఈగిం జలనుండి తీసిన చమురును చర్మవ్యాధులను బోగొట్టుటకును ఇతర జబ్బులకును వాడుదురు.

కురంగవాము :—చెట్టు గుబురు మొక్క. దీనిలో రెండు రకములు గలవు. ఒకటి తెల్లని పువ్వులను రెండవది, కొంచె మెఱ్ఱని పువ్వులను బూయును. ఈ రెండవ రకము చె ట్టేమంచిది. దీనినే తఱుచుగాఁ బెంచెదరు. దీని కాయలనుం డి, గింజలనుండి ఎఱ్ఱని రంగువచ్చును. ఈరంగుతో పట్టుబట్ట లకు రంగువేయుదురు. కాయలను ఉడకబెట్టి, గింజలచుట్టు నుండు కండదీసి దానిని నుపయోగించెదరు.


దీనిగింజలు, వేరుబెరడును ఔషధములలో గూడ వా డుదురు. వేరు, బెరడు జ్వరములకు పనిచేయును. గింజల క షాయము శగరోగముల కితురు.

కసరు :— చెట్టు గుబురు మొక్క. దీనిమీఁద ముండ్లుగలవు. ఆకులు నిడివి చౌకపాకారము.

పెద్ద కసరు :— పైదానంత విరివిగా బెరుగుటలేదు. దీని ఆకులు అండాకారముగ నున్నవి.

పావలి కుటుంబము.

ఈకుటుంబము చిన్నది. దీనిలోఁజేరు మొక్కలన్నియు గుల్మములలే; పెద్దచెట్లులేవు. ఆకులు, సమాంచలము. అభిముఖచేరికగా నైనను, ఒంటరి చేరికగానైనను నుండును. కణుపులవద్ద రోమముల వంటివి గలవు. రక్షకపత్రములు రెండు. అవి మొగ్గలో అల్లుకొని యుండును. ఆకర్షణ పత్రములు నాలుగో, అయిదో గలవు. కొన్నిటిలో నడుగున నివన్నియు గలసి యున్నవి. దళవలయము కొన్నిటిలో వృంతాశ్రితముగను, గొన్నిటిలోఁ బుష్పకోశాశ్రితముగఁ గూడనున్నది. కింజల్కములు నాలుగుగాని అంతకంటె నెక్కువగాని యుండును, పుష్పాడితిత్తులు రెండుగదులు. అండాశయము ఒకగది. అండములు రెండో, ఇంక నెక్కువరో యుండును. కీలము చివర రెండుమొదలు ఎనిమిది చీలికలవఱకుఁ గలవు. ఈచీలికలు కీలాగ్రముల వలెనే నుండును.



పెద్దపావలికూర.

పెద్దపావలి కూరయు, సన్నపావలి కూరయు :— మిక్కిలి తేమగానున్నచోటులఁ బెరుగుచున్నవి. వీనిని కఱువు కాలమందు వండుకొని తిందురు. మఱియు వీని పచ్చియాకులును గింజలునుగూడ నౌషధములలో వాడుచున్నారు గింజలు మూత్రవిసర్జనమప్పుడు కలుగుమంట మొదలగు జబ్బులకును, శగకును, వాడుదురు. శరీరము నొప్పులుగానుండి మంచుకట్టవలసి వచ్చినపుడు. మంచునకు బదులుఁగా, పచ్చియాకులను నూరి గట్టవచ్చు నందురు.

పొన్న కుటుంబము.

ఇదియొక చిన్నకుటుంబము. దీనిలో పెద్దచెట్లు, గుబురుమొక్కలు మాత్రముగలవు. ఈమొక్కలలోను, జిల్లేడు మొక్కలోనున్నట్లు పాలుగలవుగాని అవిచిక్కగాను, సాధారణముగ పచ్చగాను నుండును. ఆకులు లఘుపత్రములు, అభిముఖచేరిక, నున్నగానుండును. పువ్వులలో నేకలింగపుష్పములు మిథునపుష్పములుగూడ నున్నవి. పుష్పకోశపు తమ్మెలు మొగ్గలో నల్లుకొని యుండును; ఇది ఈకుటుంబము యొక్క ముఖ్యలక్షణము.

పొన్నచెట్టు మన దేశములోఁ జాలచోట్ల పెరుగుచున్నది. తురాయి ఆకులవలె దీనియాకులు ఒక్కమాటు రాల

వు. ఇది సదాపచ్చగానుండి ఇంపుగొలుపు చున్నది. ఇది సంవత్సరము పొడవున పుష్పించును. పువ్వులకు మనోహరమగు వాసన గలదు. కృష్ణుడు గోపికావస్త్రముల నపహరించి దీనిపై నెక్కెనని చెప్పుటచేత మనకాదరణీయము నైనది. దీనిగింజలనుండి చమురుతీసి కొన్నిచోట్ల నౌషధముగ నుపయోగించు చున్నారు. అదికీళ్ళనొప్పులు, పుండ్లు మొదలగు జబ్బులకు పైనరాసినచో గుణమిచ్చునందురు. దీనికలపయు బాగుగనే యుండును. పెట్టెలు, కుర్చీలు, తెరచాపకొయ్యలు, పనిముట్లు మొదలగునవి చేయుటకుఁబనికివచ్చును.

నాగకేసరము :— చెట్టుకూడ మిగుల అందముగా నుండును. ఆకులు అభిముఖచేరిక, కుఱుచ తొడిమ. బల్లెపాకారము. పువ్వులు పెద్దవి. తెల్లగానుండును. దీనివాసనయు మనోహరముగ నుండును.

తేయాకు కుటుంబము.

తేయాకు కుటుంబముచిన్నది. దీనిలో నన్నియు గుబురు మొక్కలు. ఆకులు ఒంటరిచేరిక, లఘుపత్రములు. పువ్వులు పెద్దవి. వానికి చేటికి లుండును. రక్షకపత్రములు, ఆకర్షణపత్రములు అయిదేసి యుండునుగాని నాలుగుమొదలు తొమ్మిదింటివఱకుఁ గూడఁ గలుగుచుండును. ఇవిమొగ్గలో

నల్లుకొనినట్లయినను మెలిమెట్టినట్లయినను ఉండును. కింజల్కములు చాలగలవు. అండకోశము ఉచ్చము. దానిలో గదులు మూడు మొదలు అయిదువఱకు నుండును.



తేయాకు.

తేయాకు :—మొట్టమొదట ఇంగ్లీషువారికి చీనాదేశమునుండి ఎగుమతి యగుచుండెను. కాని కొంతకాలము జరిగినపిమ్మట అచ్చటనుండి వచ్చుటకు కొన్నియిబ్బందులు వచ్చెను. తేయాకు ఒకచీనాదేశములోనే పెరుగుచుండుటవల

నఁ గలుగు కష్టమును బోఁగొట్టుటకు మనదేశమునందుఁగూడ ఆమొక్కలను బెంపవలసినదని మొదట, ఈస్టిండియాకంపెనివారు గవర్నరు జనరలగు వారనుహేస్టింగునకుఁ దెలియఁజేసిరి ; కాని అప్పుడెందుచేతనో అశ్రద్ధయయ్యెను. బెంటింగుప్రభువు వచ్చినతరువాఁత తేయాకుపైన శ్రద్ధహెచ్చెను. చీనాదేశమునకుఁ గొందఱను బంపి, మొక్కలను, గింజలను, దీనిసంగతెఱిఁగిన యాదేశస్థులఁ గొందరును రప్పించి హిమాలయపర్వతములవద్దను, అస్సాములోనుదాని నాటించెను. ఈలోపుననే అస్సాములో తేయాకుమొక్క పెరుగుచున్నట్లు కానవచ్చెను, దానిసంగతి తెలియఁ జేయవలయునని ప్రభుత్వమువారు కొందఱిని నియోగించిరికాని, వారిలో వారికి యభిప్రాయభేదము రాగ నేసంగతియుఁ జాలకాలమువఱకు, దేలలేదు. తరువాఁత ఈమొక్కలయాకును బాగుండుటఁగని దీనిని పైరుచేయ గవర్నమెంటు వారంగీకరించిరి కాని కొంతకాలమైన తరువాఁత యావ్యాపారమంతయు నమ్మివేసిరి. దీనిమూలమున గవర్నమెంటువారికి చాలధనము వ్యయమైయుండవచ్చును, కాని తేయాకుమూలమున, నదివఱకు సేవ్యములో లేని అయిదులక్షల యెకరములిప్పుడు వ్యవసాయములో నున్నవి. 600,000 మంది జనులకు ఉద్యోగములు గలిగినవి. ఇప్పుడు తేయాకుమీఁద పెట్టుబడి 300,000,000 రూపాయలు.

తేయాకు మొక్కనుండి మనకుఁ గావలసినది లేత యాకులే. సంవత్సరము పొడవున లేత యాకు దొరకుట దుర్ఘటమే కాని సాధ్యమైనంతవఱకు అదిచాల వచ్చునట్లుఁ జూడవలెను. తేయాకును మొట్టమొదట పైరుచేసినపుడు కొందఱు హిమాలయ పర్వతములమీఁద బాగుగఁ బెరుగు ననియు కొందఱు అస్సాములో బాగుగ బెరుగుననియు కొందఱు పర్వతముల లోయలలోఁ బాగుగ బెరుగునని యుఁ జెప్పుచువచ్చిరి. కాని నిజమైన సంగతి, యీమొక్క యాయన్నిచోట్లను బెరుగగలదు. దానికి విస్తారము శీతలము క్కరలేదు. ఉష్ణమును అంతగా కూడదు. తఱుచుగా వర్షములు మాత్రముండవలెను. నేలయు సాధారణముగ నుండవలెనుగాని మిక్కిలి గట్టిగనున్నచో వేళ్లుబారుట సులభము గాదు కనుక, అట్టిచోట్లఁ బెరుగలేదు. నేలలో విస్తారము తేమయు నుండరాదు. నీ రింకుచు సారవంతముగనున్న నేల శ్రేష్ఠైన పనికివచ్చును. ఎండకు నెండి పగులుచు, నీరింకనీయని నేలలు బొత్తుగా పనికిరావు.

తేయాకు మొక్కలను గింజలు పాతియే పైరుచేయుదురు. కొమ్మలు పాతిపెంపఁజూచిరిగాని, అవివేళ్ళుబారి పెరుగుట కష్టమయ్యెను. దీనివిత్తనములకై, కొన్ని చెట్లయాకులనుగోయక వానినెదుగ నిత్తురు; అవిముప్పది నలుబది యు

డుగులెత్తువఱకుఁ, గూడఁబెరుగును. వానికాయలు పెద్దవగుట
కు సంవత్సరము పట్టును. విత్తనములను, నాలుగైదు అడు
గుల వెడల్పున మళ్ళుచేసి ఎరువేసి, అరడుగు దూరమునఁ
బాతెదరు. అదివఱకచ్చోట చెట్లుండినచో వానిమొదళ్ళను
బూర్తిగ లాగివేయవలెను. రాళ్ళున్నచో వానిని త్రివ్వివే
యవలయును. అదివఱ కక్కడ తేయాకుమొక్కలే మొలచి
నచో నెరువు బాగుగ వేయవలయును. ఆరుమాసములో
సంవత్సరమో ఈమళ్ళలోనున్న తరువాత వానిని దీసి పొల
ములోఁ బాతుదురు. పాతునప్పుడు ఒకదానికొకటి నాలుగడు
గుల కంటె దగ్గరగానుండుట గాని, అయిదడుగులకంటె దూ
రముగా నుండుటగాని మంచిదిగాదు. ఇట్లుపాతిన యెడల నిం
చుమించు ఎకరమునకు 2,000 మొక్కలు పట్టును. ఇప్పుడు
చాలచోట్ల త్రిభుజాకారముగను నాలుగున్నర యడుగుల
దూరమునను బాతుచున్నారు. చేలలో నీదూరములను, మొ
క్కలు పాతవలసిన చోట్లను యానవాళ్ళు పెట్టుకొనిన తిరు
వాఁత గోతులుతీసి మళ్ళలోనుండి చిన్నమొక్కలను దెచ్చి
పాతవలెను. వానిని దెచ్చునపుడడుగున కొంతమట్టితోఁగూ
డఁ దీసికొనిరావలెను. తల్లివేరైనను వంగియున్నచో దాని
ని వంగినచోట గోసివేయుటమంచిది. పిల్లవేళ్ళను విప్పారియు
న్నవానిని దగ్గిరగా దీసికొనిరారాదు. మఱియునవి మళ్ళ

లో నెంతలోతుననున్నవో యంతలోతుననే పాతవలెను. ఎక్కువలోతుగఁ బాతినచో మొక్కకు హానివచ్చును. పైకిఁ బాతినయెడల వేళ్ళుపైపైననే యుండి చచ్చిపోవుట తటస్థించును. వీనిని పాతగనే వర్షముకురిసినా, చేయవలసినపని వానిచుట్టు గడ్డి మొక్కలను లేకుండఁ జూచుటయే. ఒకవేళవర్షము కురియకున్నచో నారు పోయవలెను. వీనికి నీటియాధారము బాగుగ నుండవలెను. చేలలో ముప్పది నలుబది యడుగుల దూరమున మూడడుగులు లోతుగల కాలువలుండవలెను

తరువాఁత, తేయాకు మొక్కలను గత్తిరించుట మిక్కిలి జాగరూకతతోఁ జేయవలెను. హిందూస్తానమునందు మార్గశిరము ఫాల్గుణమాసములమధ్య కత్తిరించుచుందురు గాని దక్షిణదేశమునందట్టి నియమితకాలము లేదు. మొక్కలెదుగని కాలములోఁ గత్తిరించుటమంచిది. ఏడాదిఁ మళ్ళలో బెరిగిన మొక్కలను చేనులో నాటిన నొకనెలకును, ఆరు నెలలలో బెరిగినదానిని ఆరునెలలకుఁ గత్తిరించవలెను. అస్సాము తేయాకును ఆరంగుళముల యెత్తులోపునను మానిపూరు తేయాకును ఎనిమి దంగుళముల యెత్తులోపలను గత్తిరింపరాదు. ఆదుబ్బునుండి మూడు నాలుగు కొమ్మలు బయలు

దేరును. వానిని రెండేండ్లవఱకుఁ గత్తిరింపఁగూడదు. మూడవయేట పదునాలుగో పదునెనిమిదియో అంగుళము లెత్తు వయినఁ గత్తిరింతురు. అటుపిమ్మట ప్రతిసంవత్సరము నిరుడు కత్తిరించిన దాని కొకటి రెండంగుళములెత్తుగాఁ గత్తిరించవలెను. బహుశః లేతచిగుళ్లంతకంతకు తగ్గిపోవుచుండును. అప్పుడు మరల మొక్కను 12, 15 అంగుళముల యెత్తుపైనఁ గత్తిరింపవలసివచ్చును. ఒక్కొక్కప్పుడు మొక్కను మొదలంట కత్తిరింపవలసి వచ్చును బాగుగా నెదుగవని తోచిన కొమ్మలను లాగివేయుట మంచిది. నీరసముగా నుండి, నేలమీఁద పడియున్నవానిని త్రుంపివేయవలెను' చచ్చిన కొమ్మల నసలే యుండనీయరాదు. గుబురుప్రక్కనున్న కొమ్మలను మధ్యగానున్నవానిని ఒకటే యెత్తునకుఁ గత్తిరించవలెను. క్రొత్తగా నేర్పడిన దారువు రెండంగుళములకంటె నెక్కు వుండ రాదు.

అట్లు కత్తిరించిన రెండు మూడు నెలలకు సుమారు తొమ్మిదంగుళముల ఎత్తున క్రొత్త కొమ్మ లెదుగును. అప్పుడు వానిని త్రుంపుదురు. మధ్యనున్న కొమ్మమీఁద ఆరాకులున్నప్పుడే త్రుంపుట నారంభింతురు. చివరనున్న రెండాకులనే గోయుదురు. వానిని గోయుటకు ఆకులను బట్టికొని లాగరు. మనకు కావలసినది లేతయాకులును చిగుళ్లును గా

వున కొమ్మమీఁద నింకను లేతరెమ్మలు వచ్చునట్లు చూడవలెను. కావున, ఆ రెండాకులనుంచి బొటనివేలి గోరుతో ఆ చిగురు త్రెంపివేయుదురు. అట్లు చేయుటవలన, మిగిలిన యాకులవద్దనుంచి రెమ్మలు బయలుదేరును. మధ్యకొమ్మమీఁద నెంతయెత్తుననున్న యాకులను బెరికితిమో చుట్టునున్న కొమ్మలమీఁద కూడ అంత యెత్తు ననున్నవానినే బెరుకుట మంచిది. ఈవిధమున ఆ రేడుమారులు కూడ చిగుళ్ళను తుంపవచ్చును. అట్లు తుంపుటలో పెద్దయాకును మొక్కటయిన మిగిల్చి తుంపుట మంచిది.

మొక్కలను బాతిన మూడునాలు గేండ్లలో ఆకంత గా రాదుగాని ఆఅవధినేటినుండి అయిదువందల పౌనులు ఆకు వచ్చును.

ఈ మొక్కలకు అరిష్టములును జాలకలవు. పురుగులు పట్టుచుండును. అవి వేసవి కాలమం దాకులరసము పీల్చివేయును. కొన్నిరకముల బూజుకూడ వీనిలోఁ బ్రవేశించును. కొన్నిటిపై గంధకపుపొడియుఁ, గొన్నిటిపై సున్నము, గంధకము కలిపి కాచిన నీరును జల్లుదురు. వానివలన కొంచెము నయ మగుచుండును.

చెట్టునుండి కోయగనే ఆకు కాచి త్రాగుటకుఁ బనికి రాదు. పచ్చిగానున్నప్పుడు దానియందుఁ బసరువాసనతప్ప మఱేమియు లేదు. దానిని సిద్ధముచేయుటకు తంతు చాలగలదు. అదంతయుఁ గొంతకాలమువఱకుఁ జేతితోడనే చేయుచు వచ్చిరికాని, తరువాఁత తరువాఁత యంత్రములను గల్పించి వానిసహాయమున సులభముగఁ జేయుచున్నారు.

ఆకునుగోసి తేఁగానే చల్లనిచోటను నెండదగులని చోటునను వానిని పలుచపలుచగా నారఁబోతురు. ఆకు సాధారణముగ నిఱువది గంటలలో వడులును. ఇంతకంటె నెక్కువ కాల మట్లుంచినయెడల మంచివాసన పోవును. కాని యొకక్కప్పుడంతకు వడలకుండ నున్నయెడల మఱికొంతసేపట్లుంచవలయును. వడలిన యాకును దీసి యొక బల్లమీఁద వేసి యంత్రములు రాకపూర్వము చేతులతో రాసెడివారు. ఆరాపిడి తగులుటవలన ఆకులోనున్న పసరు కొంచెము పైకివచ్చును. ఎక్కువ రసము వచ్చినకొలఁది ఘాటెక్కువ యగును. ఆరసమునకు గాలి సోకగనే వానియందు కొన్ని మార్పులు గలుగుచున్నవి. ఆకంచునందు గోధుమవర్ణముగా నగును. ఆయాకును దీసి మిక్కిలి పరిశుభ్రముగను, చల్లగను, తేమగను నున్న చీకటిగదులలో సంగతి సందర్భములను బట్టి రెండు మొదలు ఆరుగంటలవఱకుఁ బెట్టుదురు. అప్పటికి తే

యాకునకు సువాసన వచ్చును. అట్లెంతకాల ముంచవలెనో కొంచె మనుభవ మున్నయెడల ఆకును జూడగనె చెప్ప వచ్చును.

తరువాఁత ఆకునంతయుఁ దీసి వెచ్చఁబెట్టెదరు. ఇట్లు వెచ్చఁబెట్టుటకును యంత్రములు గలవు. మిక్కిలి వేడిగా నున్న గాలిని యాకుపైఁ బారనిచ్చెదరు. ఆకు మూఁడువంతులు తడి యారినపిదప వేడిని తగ్గింతురు. అటుపిమ్మట దానిదీసి జల్లెడవంటిదానిలోఁ బోసి నొక్కుదురు. ఆకంతయు సమముగా తెగును. జల్లెడ కంతలు సన్నముగా నున్నయెడల ముక్కలును సన్నముగా నేయుండును. ఆకును రకములవారిని నేర్పరచి పెట్టెలలోఁ బెట్టి యంగళ్ళకుఁ బంపుదురు. ఈపెట్టెల కన్నిరకముల చెక్కలు పనికిరావు. కొన్నిచెక్క లాకు సువాసనను తగ్గించును. వానిలోపల పలుచని సీసము రేకు వేయుట మంచిది. మఱియు ఆపెట్టెలకు మూఁత గట్టిగానుండవలెను గాని లేనిచో గాలి బీల్చుకొని వాసన తగ్గును. తేయాకును జేయుటకు మఱికొన్ని పద్ధతులు గలవు. కొన్ని చోట్ల ఆకును కోయగనే ఆరబోయక వెచ్చబెట్టుదురు. కాని పైన చెప్పినదే మనదేశములో విశేషముగ నున్నపద్ధతి.

ఆంగ్లేయసంపర్కము తగిలిన యప్పటినుండియు ఇంగ్లీషువిద్య వ్యాపింప నారంభించినప్పటినుండియు మనముగూడ

తేయాకు కషాయము త్రాగనేర్చితిమి. అది సువాసనగను పాలును పంచదారను గలుపుదుము గాన, రుచిగను నుండుట నిజమే. అది అప్పటికి చుఱుకును బుట్టించి నిద్దుర రాకుండఁ జేయును.

గుగ్గిలపు కుటుంబము.

గుగ్గిలపుచెట్లు మనదేశములో విరివిగానే పెరుగుచున్నవి.

ఆకులు :—లఘుపత్రములు. ఒంటరిచేరిక అండాకారముగ నైన నిడివి చౌకపునాకారముగనైన ఉండును. సమాంచలము. విషమరేఖ పత్రము. కొన, వాలము గలదు.


పుష్పమంజరి :—కొమ్మలచివరలనుండి గాని, కణుపుసందులందుండి గాని మధ్యారంభమంజరులగు రెమ్మగెలలు. పుష్పముల ఉపవృంతములు మిక్కిలి పొట్టివి. పువ్వులు శేత పసుపురంగు.

పుష్పకోశము :—సంయుక్తము. గొట్టము పొట్టి. తమ్మెలు సన్నము. మొగ్గలో అల్లుకొనియుండును.

దళవలయము :—అసంయుక్తము. 5. కొంచెము బల్లపునాకారముగనుండును. మంచి వాసనయే గలదు. వృంతాశ్రితము.

కింజల్కములు :—ఏబది గలవు. పుష్పాడిత్తులు రెండుగదులు. కింజల్కములు వృంతాశ్రితములు.

అండకోశము :—అండాశయము ఉచ్చము 3 గదులు గలవు, ఒక్కొకదానియందు రెండేసి యండము లున్నవి. కీలము పొట్టి. కీలాగ్రములు మూడు చీలికలు, కాయ ఎండి పగులును.



తెల్లదామర.

ఈకుటుంబములోని చెట్లన్నియుఁ బెద్దవృక్షములే. వీని యన్నిటినుండి గుగ్గిలమువంటి పదార్థము వచ్చును. ఆకులు ఒంటరిచేరిక లఘుపత్రములు. వీనికి చిన్నచిన్న కణుపుపుచ్ఛము లున్నవి. పువ్వులకు మంచి వాసన గలదు. ఆకర్షణపత్రములు సాధారణముగ మొగ్గలో మెలివెట్టినట్లుండును. కీలాగ్రములు మూడు.

గుగ్గిలము:—చెట్లు హిమాలయ పర్వతముల ప్రాంతములను, రాజమహాలుకొండలవద్దను, ఒరిస్సా, మధ్యపరగణాలు ఆంధ్రదేశములోను ఎక్కువగాఁ బెరుగుచున్నవి. ముదురుచెట్లను మూడు నాలు గడుగు లెత్తున చెట్టు పరిమాణమును బట్టి నాలు గైదుచోట్ల (బెరడు) గీసెదరు. ఆ చారలలోనికి అరపూసవంటి పదార్థము వచ్చిచేరును. అది మొట్టమొదట తెల్లగానే యుండును గాని తరువాత కొంచము గోధుమ వర్ణము వచ్చును. ఇదియే గుగ్గిలము. దీనిని తీసివేసినతరువాత కొన్నినెలలకు ఆచారలలోనే మఱికొంత చేరును. ఇట్లు మూడుమాట్లు తీయవచ్చునుగాని మాటిమాటికి తక్కువరకము వచ్చుచుండును. గుగ్గిలము నౌషధములలో వాడుదురు. దీనిని లోపలి కివ్వరుగాని కొన్ని మందులతోఁ గలిపి పైన రాయుచుందురు. దురువాసనఁ బోగొట్టు

టకు దీనిని పొగవేయుదురు. పడవలు, ఓడలు కట్టుటలో దీనినుపయోగింతురు. దీనిబెరడు తోలుబాగుచేయుటకుఁగూడ పనికివచ్చును.



గుగ్గిలపు కొమ్మ.

తెల్లడామర :— చెట్టు పెద్దదియె. దీనియాకులు నమగోళాకారము. దీనినుండియు గుగ్గిలము వంటిది వచ్చును. దీనిని గూడ గుగ్గిలము వలె నౌషధములలో వాడుదురు. దీనిని

కర్పూరతైలములో గలిపిన మంచి "వార్నీషు" అగును. దానినే కొబ్బరినూనెలోఁ గలపి క్రొవ్వువత్తులుకూడ చేయవచ్చును. తెల్లడామర గింజలనుండి వచ్చు చమురుకూడ క్రొవ్వువత్తులుచేయుటకుఁ బనికివచ్చును. ఈచమురు నొకక్కప్పుడు నేతిలో కలిపి దగా చేయుచుందురు. దీని బెరడు వగరుగానుండును. కల్లు పులియకుండ కొన్నిచోట్ల దీనిని వేయుచుందురు. కలప గుగ్గిలపుచెట్టు కలపంత మంచిది కాదు.

నల్లడామర:—ఆకులు కొంచెము హృదయాకారముగనుండును. దీనినుండియు గుగ్గిలము వచ్చును. ఈచెట్టునుండి మంచికలపయు వచ్చును.

బెండ కుటుంబము.

బెండమొక్క మంచినేలలం దారడుగులవరకుఁ బెరుగును; లేతభాగములందు గుచ్చుకొను నూగును గొంచము నీలముగానున్న మచ్చలును గలవు.

ఆకులు:—ఒంటరిచేరిక, లఘుపత్రములు, కొంచము పైగానున్న యాకులు చీలియున్నవి. చివరవానికిఁ బెద్దతమ్మెలుగలవు; తాళపత్రవైఖరి. అంచున అంపపుపండ్లున్నవి. కఱుకుగానున్న రోమములును గలవు తొడిమ పొడుగు. కొమ్మ ఆకుకంటె నెత్తుగానుండును. రెండుకణువు పుచ్ఛములు గలవు.

పుష్పమంజరి:—కణుపుసందుల నొక్కొక్క పుష్పముగలదు. పుష్ప పెద్దది. తెల్ల పసుపురంగు, అడుగున కొంచెము ఊదారంగుగ నుండును. వృంతము పొట్టిది. చేటికలు మఱియొక పుష్పకోశమువలె నేర్పడుచున్నవి.

పుష్పకోశము;—సంయుక్తము. ఒక ప్రక్కన చీలును. మృదువుగా నున్నది. నీచము.

దళవలయము:—అసంయుక్తము. అడుగునకొంచము మాత్రము కలసియుండును. 5 ఆకర్షణపత్రములు, మెలివెట్టియుండును.


కింజల్కములు;—అన్నియుఁగలసి కీలముచుట్టును గొట్టమువలె నేర్పడుచున్నవి. పుప్పొడితిత్తులు చాలగలవు, కాని ఒక్కొక్క దానియందొక్కొక్క గదిమాత్రమున్నది.

అండకోశము:—అండాశయము ఉచ్చము, సాధారణముగ నైదు గదులుండును. ఒక్కొక్క గదిలో నొక్కొక్క వరుస గింజలు గలవు. కాయ ఎండి పగులును. కీలము గుండ్రముగాను పొడుగుగాను నుండును. ఎన్నిగదులున్నవో అన్ని కీలాగ్రములుగలవు.

తుత్తురుబెండ పలుచోట్లఁ బెరుగు గుల్మము.

ఆకులు:—ఒంటరిచేరిక, లఘుపత్రములు, హృదయాకారము, అంచు మించు సమాంచలము. వాలము కలదు, ఈనెలు తాళపత్రి వైఖరినున్నవి.

పుష్పమంజరి:—కణుపు సందుల నొక్కొక్క పుష్పముండును. ఆకు తొడిమకంటె వృంతము పొడుగు. పుష్పము సరాళము సాయంత్రము వికసించును. వృంతముచివర నతుకుగలదు.



తుత్తురుబెండ.

పుష్పకోశము:—అయిదు రక్షక పత్రములున్నవి. అండాకారము కొన సన్నము ఇవి యల్లుకొనియుండును. క్రింద కొంచము కలసియున్నవి.

దళవలయము:—అయిదు ఆకర్షణ పత్రములు. అడుగున నొకదానితో నొకటి కలిసి కింజల్కపు గొట్టము నంటియున్నవి. పసుపురంగు.

కింజల్కములు:—అన్నియుఁ గలసి గొట్టమువలె నేర్పడి చివర మాత్రము విడివిడిగా నున్నవి. పుష్పాడిత్తులందు నొకగది మాత్రమే గలదు.

అండకోశము:—అండాశయముచ్ఛము. పలుగదులు. కాయకాసెడు స్త్రీపత్రములు 15-20. ఫలమువిచ్చెదు కాయవలె నుండునుగాని స్త్రీపత్రములు బద్దలై గింజలు బైటకు వచ్చును,

ఈకుటుంబములో గుల్మములు, గుబురుమొక్కలు చెట్లునుగలవు. ఆకులు ఒంటరిచేరిక, లఘుపత్రములో తాళపత్రవైఖరినున్న మిశ్రమపత్రములోగలవు. కణుపు పుచ్ఛములున్నవి. లేఁతకొమ్మలపై మెత్తనిరోమములును గలుగుచుండును. పుష్పములు పెద్దవి. ఒంటిరిగానుండును. రక్షకపత్రములు ఆకర్షణపత్రములై దేసిగలవు, కింజల్కముల న్నియుఁగలసియుండును లేదా కొన్ని కొన్నియైనఁ గలసియుండును. అడుగున దళవలయము నంటియుండును. పుష్పాడిత్తులొక్కొకగది. అండాశయములోఁ జాలగదులున్నవి. కాయపగులును, లేదా, విచ్చును.

బెండ:—మొక్కలకు నెరువు ఎక్కువగఁ గావలయును. కొన్నిచోట్ల గింజలనొకమడిలోఁజల్లి లేఁతమొక్కలను దీసి దూరదూరముగఁ బాతుదురు. ఒకరకము, గింజలుచల్లి

న నాలుగు నెలలకే కాయలుగాచును ఒకరకము చాలనెలలకుఁగాని కాయదు. ఎకరమునేల మొక్కలువేయుటకు సుమారు అయిదు రూపాయలగును. లాభము ఎకరకమునకుఁ దొమ్మిది పది రూపాయలు మాత్రము వచ్చును. ఇవి ఒక చోటనే సంవత్సరమునకు రెండుపంటలు కూడఁబండును. శేఁత బెండకాయలను గూరవండుకొనుదుము. బెండమొక్కనుండి మంచినారయు వచ్చును. గాని దానినిదీసి ప్రత్యేకముగ నమ్ముటలేదు. కొన్నిచోట్ల మాత్రము కొంచమో, గొప్పయో దీసి గోగునారలోను జనపనారలోను గలుపుచున్నారు. బెండకాయలోను గింజలందును నున్న జిగురును ఔషధములలో వాడుదురు.

కస్తూరిబెండ:—గింజలు సువాసన వేయును. వీనిని పరిమళముగానుండు నూనెలుచేయుటలోను ఔషధములలోను వాడుదురు. ఈమొక్కనుండియు మంచినార వచ్చును.

ప్రత్తి:—మొక్కలు పెంచుటయు నూలుదీసి బట్టలు నేయుటయు మనదేశములోఁ జిరకాలమునుండి కలదుగాని ఐరోపియనులు మూడు వందల సంవత్సరములక్రిందట దాని యుపయోగము లంతగానెరుగరు, అమెరికా దేశములోఁబండించుటకుఁ బూర్వ మింగ్లాండునకు నూలు మనదేశ

మునుండియే బోవుచుండెను. అమెరికా పత్తి మేలురకమ గుటచే నిప్పుడు దానికెక్కువ ఖరీదుగలదు. ఈ పత్తి పోగులు పొడుగుగా నుండును. ఈరకము మనదేశములోను నాటిరిగాని యచ్చటవలెఁ బెరుగ లేదు. ఇదివరకే పత్తిలోఁ బెక్కు తెగలును బలురకములును గలవు. ఏరకముమంచిది, ఏదిసులభముగాఁ బెరుగును అను చర్చలిదివరకే చాలజరిగెను. ఇప్పుడనేక రకములు పెరుగుచున్నవి. మనదేశపు ప్రత్తి కణుగుణముగానుండెడు మఱలను జేసిరి, మనపత్తికి ఇంగ్లండునందు తక్కువధర యుండుటయు, తక్కువధరయగుటచే మంచిపత్తిని బెంచుట కుపేక్షజేయుటయు, అన్ని రకములను కలగలపుటయుఁ దటస్థించుచువచ్చెనుగానియిప్పుడు, మంచిరకములకు వేఱువేఱుగాఁ దగిన తావులందుఁ బైరుచేయుచున్నారు. దీనినిసాగుచేయుట నేలనుబట్టియు, అచ్చటి శీతోష్ణస్థితులనుబట్టియుఁ బత్తి రకమునుబట్టియునుండును. కొన్నిచోట్ల దీనిని కందులు, జొన్నలు, నువ్వు..., మొదలగు వానితోఁగలపి చల్లుదురు. కొన్నిరకముల గింజలను జల్లునపుడు వానినంటుకొని పూర్తిగనూడకయున్న పోగులు మూలమున గింజలొకదాని నొకటంటుకొనకుండునట్లు పేఁడ, ఇసుక మొదలగువానిలో వానిని బొర్లించెదరు. కొన్ని చోట్ల నెండినకాయలనెల్లఁ గోయుదురు; మఱికొన్నిచోట్ల

పొలములోనున్న చెట్లన్నియు ఫలించినగాని కోయుట కా
రంభింపరు.

గింజలనుండి ప్రత్తి విడదీయుటకు సాధనములు చిర
కాలముక్రిందటనే మనదేశమునగలవు. అలగ్జాండరు మన
దేశముపై దండెత్తవచ్చినపుడు ఆతనితో వచ్చిన శాస్త్రజ్ఞ
లుకొందరు వీని యుపయోగములను దెలిసికొని వారి దేశ
ములో వింతగఁజెప్పిరి. ఇప్పటి యంత్రములును పూర్వపు
వానివలెనే యుండునుగాని వీనితో నావిరిసాయమున బనిచే
యవచ్చును. అందుచే నివిలాభకారులు. ఆవిరియంత్రము
లు వచ్చినప్పటినుండియు నూలుబట్టలు నేయుట సులభమ
య్యెను యంత్రశాలలు పెక్కుతావుల స్థాపింపఁబడెను. బట్ట
లధరయుఁ దగ్గెను. అయినను నేఁతబట్టల వాడుక పోలేదు.
సాలీలు ఇప్పటికిని బట్టలు నేయుచు అమ్ముచున్నారు. దీనికి
నేఁతబట్టలను కట్టుకొన నిచ్ఛగలిగియుండుటయు, మరలతో
నేసినవానిమానగోరుటయుముఖ్యకారణములుగానిమరలతో
నేసినవి తక్కువరకములనిగాదు పగ్గములతో నేసినవానికం
టెను సన్నని మెత్తనిబట్టలను యంత్రశాలలందు నేయుచు
న్నారు. కాని వీనితోఁ జిత్రవిచిత్రముగ బొమ్మలుతీఁగెలు
గల్గునేయుట పగ్గములతో నేయుటకంటెఁ గష్టమైన మాట
నిజమే. డక్కాపట్టణమందిదివఱకు నేసెడు మిక్కిలి మృదు

వగు బట్టలవంటి వానిని నేయుటయుఁ గష్టమనియే కనుపట్టు చున్నది. ఈబట్టలను నేసిన సాలీలనే అమెరికా దేశపు నూ లుతో నేయమనిన వస్త్రములు నేయఁజాలకపోయిరి. ఈ పత్తి చలువచేయుటవలన నుబ్బి బిరుసగునుగాని మన దే శపుపత్తి వలె సన్నముగాదని జెప్పుదురు. ఇప్పుడు మనదే శములో నూలుబట్టలు నేయు యంత్రశాలలు చాలనేగల వు. కాని ఉండవలసినన్ని లేవు: ఈసంగతి, మనదేశమును గొన్నియితర దేశములతోఁ బోల్చిచూచిన దెల్లముకాగల దు. 1901 సంవత్సరములో నింగ్లాండునందు 2077 మఱలు ను. అమెరికాలో 1123 మఱలును, జర్మనిలో 390 మఱలు ను మనదేశములో 203 ను జపానునందు 64 గలవు. ఇప్పు డుమనదేశమందు 258 మఱలుగలవు. అయిన నిచ్చట నేయునవి చాలక పీనికిమూడు రెట్లన్య దేశములనుంచి దిగు మతిచేసికొనుచున్నాము. మొట్టమొదట మనదేశమునకు వ చ్చెడు నూలుసరకుల మీఁదఁబన్నుగలదు. కొంతకాలమైన పిదపదానినిగొట్టివేసిరి. కొట్టివేసినయెడల మనదేశపుయంత్ర ములకును జేతిపనులకును అభివృద్ధిగలుగదనిగట్టిగాపట్టుబట్టగా సన్నరకముల బట్టలమీఁద మాత్రము పన్నుగట్టుచువచ్చిరి. ఈ సన్నరకపు బట్టలకంతగా అమ్మకములేదు, ముతకబట్టలు మనదేశములోనే చౌకగవచ్చుచుండెను. ఎక్కువ అమ్మక

ముగల మధ్యరకము బట్టలు మనదేశములోను నేయుచుండిరి; కావున దిగుమతి అయ్యెడువానిపైఁ బన్నుగట్టిన నవి ప్రియమై వానిఖర్చుతగ్గును. అందుచే నితరదేశములలో నేయువానియమ్మకము దగ్గును. ఈహానినివారించుటకునిఱువది నెంబరుపైనున్న బట్టలకెల్ల, మనదేశములో నేసినను, పైనుండి వచ్చినను సమముగానే పన్నువేయుచువచ్చిరి. చేతిమగ్గములమీఁద మాత్రము పన్నులేదు.

ప్రత్తిగింజలనుండి మంచినూనె వచ్చునుగాని మనదేశములోఁ దీయుటలేదనియే చెప్పవచ్చును. కొన్నిదేశములవారీనూనెను వంటలందును వాడుకొనెదరు. గింజలు పశువులకుఁ బెట్టెదరు. నూనితీసినపిదపఁ దెలకపిండిని గూడ పశువులకు బెట్టవచ్చును.

ప్రత్తిగింజలను, లేఁతచిగుళ్ళను కాయలను ఔషధములలో వాడుదురు. గింజలు, జీలకఱ్ఱ, తావాక్షురి, సోపుకలిపి నూరి, రసముదీసి దినమునకు నాలుగైదు సారులు బుచ్చుకొనినయెడల కొన్నిసుఖవ్యాధులు తగ్గునందురు.

ప్రత్తిమిగుల నుపయోగమైన పదార్థము. మనబట్టలు, పరుపులు. దీపమువత్తులు అన్నియు ప్రత్తిమూలముననే వచ్చుచున్నవి.

ముండ్లబూరుగ:—చెట్టుమిగులఁ బెద్దచెట్టు. దీనిపువ్వు లెఱ్ఱగానుండును. దీనిదూది అతిమృదువుగను పోగులు మిక్కిలి పొట్టిగను నుండుటచే నేఁతకుఁ బనికివచ్చుటలేదు. దీనితోఁ దలగడలు పరుపులనుగుట్టుదురు. దీనిలేఁతపువ్వుల మొగ్గలను గొందరు తిందురు. దీనిజిగురు, గింజలు, దూది. బెరడు చిన్నమొక్కల వేరులును ఔషధములలో వాడుచున్నారు.

జిగురు ఇతరమొక్కలందువలె నాటులుపెట్టి తీయలేము. నాటుపెట్టినను రాదు; కొన్నిచోట్ల బెరడులోఁ బురుగులు దొలుచుటవలనగాని, మఱేకారణమువల్లనైనను అచ్చటిభాగము పాడుగా నున్నప్పుడు జిగురు వచ్చుచున్నది. ఈజిగురును బొడుముచేసికాని, నల్లమందు మొదలగువానితోఁగలపికాని విరేచనములు మొదలగు జబ్బులకును కవిరి యుపయోగపడు ప్రతిదానికిని వాడుదురు. దీనిగింజలును బ్రత్తిగింజలు చేయుపనిచేయును. దీనిదూదిని ఆసుపత్రిలందు వాడుదురు. ఎండినలేఁతకాయలను మూత్రవ్యాధులందును జననేంద్రియముల నీరసమును బోగొట్టుటకును వాడుదురు.




బూరు X.

బెరడు వేసుల కషాయమును కాయలుపనిజేసినట్లే పనిచేయును. అంగళ్లయందు "మరాటిమొగ్గు" అని అమ్మునది ఎక్కువగా దీనికాయలే కాని, బూరుగకాయలను (ఇది మఱియొక చెట్టు, ఈకుటుంబములోనిదె గాని వేఱొకజాతి) సంపెంగకాయలనుగూడ అమ్ముచున్నారు.

ఈచెట్టు కలప మెత్తగనుండును. గట్టిపనులకు మంచిదిగాదు. కొన్నిచోట్ల అగ్గిపుల్లలు చేయుటకు మాత్రము పయోగించుచున్నారు.

బూరుగుచెట్టు:—(బురసన్నచెట్టు) దీనిదూది కాయ, గింజలును పైదాని వలెనే నుపయోగ పడుచున్నవి. కాయలంత గుణమునీయవు. ఈకాయలతొడిమలు కాయలకంటె రెండుమూడురెట్లు పొడుగుగానుండును. ముండ్లబూరుగకాయల తొడిమలు, కాయలంతయే యుండును. ఇవివాని కంటెజిన్నవి. ఈబేధములవలన వానిని గుర్తింపవచ్చును.

కడిమిచెట్టు:—ముండ్లబూరుగు చెట్టువలె నుండును. పువ్వులు తెలుపు.



నల్ల బెండ.

నల్లబెండ:—మొక్క చిన్నది. ఆకులు హృదయాకారము, కొంచము గుండ్రముగా నుండును. రోమములు గలవు కాయ, విచ్చెడు కాయ.

తిరునల్ల బెండ:—చిన్న మొక్క దీనియాకులు కొంచము అండాకారముగను గుండ్రముగనునుండును. కింజల్కము

లు. కొన్నికొన్ని కలసి ఏర్పడినకట్టలు మూడుమొదలు ఆరువఱకు నుండును. వర్షకాలమునందే పుష్పించును.

తూటిబెండ:—మొక్కయుఁ బలుతావులనే పెరుగుచున్నది. సంవత్సరము పొడుగునఁ బుష్పించును. కాయ ఇరువదింటికిగ్రింద విచ్చును.

నూగుబెండ:—కొంచము పెద్దమొక్కయె. పుష్పముల ఱేకులువంకరగాను త్రిభుజాకారముగనునుండును. ఈనాలుగు బెండలను బెండజాతిలోనివిగావు. బెండకాయఎండిపగులును, గింజలు బైటికి వచ్చును. వీనికాయలు నెండి విచ్చునుగాని గింజలుపైకి వచ్చునట్లు పగులవు. కాయలోనున్న గదులు మాత్రము విడిపోవును, ఇవిపగులవు వీనిలోపలనే గింజగలదు.

గోంగూర:—మనదేశములోఁ జాలచోటుల బెంచుచున్నారు గాని, ఆకులనుపయోగించుటకేఁగాదు, దానినుండి మంచినారవచ్చును. ఈనారకై పైరు చేయుచున్నారు. దీనిని బెంచుటయుఁ గష్టములేదు. ఇతరపైరులతోడనే గోగుగింజలను జల్లెదరు. నారదీయుటకైనచో పుష్పించికాయలుగాసిన పిదపఁ జెట్లను గోయవలెను. పుష్పించుచుండగాఁ గోసి

నయెడల నంత మంచి నారరాదు. మొక్కలను గోసి కట్ట లుగట్టి నీళ్ళలో నూరవేసి జనపనారను దీసినట్లేఁ దీయుదురు. ఈనారయుఁ జనపనారవలెనే నుండునుగాని కొంచము ముతకగానుండును. అయినను జాలవస్తువులు చేయుటకే నుపయోగించుచున్నారు. వలలకు జనపనారకంటె నిదియే మంచిది.

దీనియాకులు పుల్లగానుండును. వీనితోఁబచ్చడి పులుసులను జేసికొందుము. ఒకరకము ఆకులెక్కువ పుల్లగానుండును.

మందారము :—(దాసాని) మొక్క ఎఱ్ఱని పెద్దపువ్వులను బూయుటచేఁ దోటలందు బెంచుచున్నారు. పువ్వుల నౌపధములలో వాడుదురు. వానినుండి ఒకవిధమగు నెఱ్ఱని రంగును వచ్చును. ఈమొక్కలనుండి కూడ నార వచ్చును.

జూకామందారము :—పైదానివలెనే నుండునుగాని పువ్వుల రేకులు చీలి చీలి యున్నవి. కింజల్కముల గొట్టము పొడుగుగానుండును, పువ్వులకాఁడపొడుగుగానుండుటచే వంగి యుండును.

బాల :—చిన్నచెట్టు. మాని నువంకరలుగా నుండు
ను. ఆకుల యడుగున మెత్తని రోమములు చాలగలవు. పు
వ్వులు పచ్చగానుండును. దీనినుండియు నారవచ్చును.

ఎఱ్ఱసాలబర్త :—గుబురు చెట్టు. ఒక్కొక చో నొక్కొ
క పుష్పముండును. కాయలు గుండ్రముగా నుండును. తె
ల్లని పువ్వులు పూసెడు రకమును గలదు.

సాలబర్త :—గుబురుమొక్క. ఏదైన ఆధారముం
డినగాని యెత్తుగాఁ బెరుగలేదు.

కొండపట్టి :—కొండలమీఁదఁ బెరుగును. ఆకులకు
మూడు తమ్మెలుగలవు. వర్షకాలములోఁ బుష్పించును.

కొండగంగ :—కొండలమీఁదఁ బెరుగుచిన్నచెట్టు.
పువ్వులు పెద్దవిగాను, గులాబిరంగుగాను నుండును ; దీనినా
రయు బాగుండును.

పద్మచారిణి :—చెట్టు తోటలందుఁ బెంచుదురు. రే
కపువ్వులు ముద్దపువ్వులు కూడగలవు. పువ్వులు ప్రాతఃకా
లమునందు వికసించి తెల్లగానుండును, కాని క్రమక్రమ
ముగ సాయంత్రమున కెఱ్ఱఁబడును.

గంగరావి :—పెద్దచెట్టు. మనదేశములోఁ జాలచోట్ల మొలచుచున్నది. దీనికాయలలోఁ బచ్చని రసముగలదు. చీడ మొదలగు చర్మవ్యాధులు కొన్ని ఈరసము రాసినచోఁ దగ్గును. బెరడు కషాయముగూడ నుపయోగించెదరు.

మునిగంగరావి :—చెట్టును పైదానివలెనే యుండును. దీని ఆకులకు వాలముగలను.

పల్లెమంకెన :—గుబురు మొక్క. ఆకులకు తాళపత్ర వైఖరిని తమ్మెలున్నవి. దీనినుండియు మంచినారవచ్చును.

చిట్టిమూతి :—మొక్క తేమనేలలందు మొలచును. దీనివేరు కషాయమును అజీర్ణమునకును, నీరసముఁ బోగొట్టుటకు నిత్తురు. తఱచుగా నల్లము రసముతోఁ గలపి కొంచమిత్తురుగాని కొంచము కొంచమిచ్చుటవలన లాభమంతగా లేదు.

ఎఱ్ఱగోంగూర :—గింజలను నూరి నీళ్ళలోఁగలిపి వడకట్టి నీరసమునకును, మూత్రవిసర్జన మప్పుడు కలుగు నొప్పులకు నిత్తురు.

అతిబల :—మొక్క చిన్నది. దీనియాకులువంకరగా నుండును. దీనినుండి మంచినారవచ్చును. ఈనారను బరీక్షిం

చి బాగున్నదని దెలిసికొని ఇప్పుడిప్పుడే పైరుచేయఁ జూచుచున్నారు.

తుత్తురుబెండ :—ఆకులను నీళ్ళతోఁ గాచిన జిగురువంటి పదార్థమువచ్చును. ఈకషాయముతో నొప్పులకుఁ బట్లువేయుదురు. గింజల పొడును శగమొదలగు వానికి వాడుదురు.

గుల్లపుబాదము కుటుంబము.

గుల్లపు బాదముచెట్టు :—పొడుగుగాఁ బెరుగును. బెరడు పెచ్చులు పెచ్చులుగా వచ్చును. లేఁతకొమ్మలమీఁదను ఆకులమీఁదను దట్టముగా రోమములుగలవు.

ఆకులు :—ఒంటరిచేరిక. మిశ్రమపత్రములు. తాళపత్రి సైఖరి, కణుపుపుచ్ఛములుగలవు. విషమరేఖపత్రము.

పుష్పమంజరి :—కొమ్మలచివరనుండి గుత్తులు గుత్తులుగా మధ్యారంభమంజరులుగలవు. పుష్పములు చిన్నవి, సరాళము, అసుపచ్చరంగు.

పుష్పకోశము :—రక్షకపత్రములు 5. వానిమీఁద దట్టముగా రోమములు గలవు. మొగ్గలో నొకదానినొకటి తాకుచుండును.

దళవలయము :—లేదు.

కింజల్కములు :—అన్నియుఁగలసి యొకగొట్టమువలె నైనవి. గొట్టముపైన గిన్నవలె వెడల్పుగానున్నది. దీనిమీఁద రెండు గదులుగల్గిన 12 పుప్పొడితిత్తులుగలవు.

అండకోశము :—పుష్పాడిదిత్తులచే నావరింపఁబడియున్నది. 5 తమ్మెలున్నవి. కీలము 1 లావుగనుండును. కాయలోనొకగదియేగలదు. అండాశయమునందున్న మిగిలిననాలుగుగదులు పెరుగవు.

ఈకుటుంబ ముష్ణప్రదేశములలోఁ గలదు. దీనిలో చిన్న మొక్కలు మొదలు పెద్దచెట్లవఱకు నున్నవి.

ఈకుటుంబపు ప్రతిమొక్కయొక్కలేఁతకొమ్మలమీఁదను లేఁతయాకులమీఁదను దట్టముగా గోధుమవర్ణముగల రోమములుగలవు. ఈరోమములు ఆముదపాకులమీఁదనున్న తెల్లనిపొడివలె లేఁతయాకులను ఎండకు వాడిపోకుండఁగాపాడును. వీనిలో ఆకులు అభిముఖచేరిక, లఘుపత్రములు, లేదా, తాళపత్రివైఖరినున్న మిశ్రమపత్రములు. కణువుపుచ్ఛములుగలవు. పువ్వులుచిన్నవి. ఆకర్షణపత్రములు కొన్నిటియందులేవు. కింజల్కలములన్నియు గలసియుండును. పుష్పాడిదిత్తులు రెండుగదులు. అండకోశము 5 గదులు. ఒక్కొక్కప్పుడు కాయలోనిగదులు విడిగానుండును.

కావలిచెట్టు :—కొండప్రదేశముల నుండును. ఆకులు లఘుపత్రములు. పచ్చని పువ్వులు, పురుష పుష్పములు మిథునపుష్పములు గలసియుండును. ప్రతిపుష్పము 5 కాయలుకాచును దీనికలప మెత్తగానుండుటచే నంతపనికిరాదు.



కాకర.

కారక చెట్టు :— పెద్దవృక్షము. ఆకులు చాల వెడల్పుగానుండును. పుష్పాడి తిత్తులు 30 వఱకు గలవు. పువ్వులు ఎఱ్ఱగానుండును.

గుజ్జుపుబాదము :— చెట్టు తోటలలోఁ బెరుగుచున్నది. దీనిగింజలనుండి చమురు తీయుదురు. చమురు కొంచెము పచ్చగానుండునుగాని వాసనయుండదు. దీనిని ఔషధముల లో నుపయోగించెదరు.

ఉదిరిక చెట్టు :— తోటలలోను అడవులలోను గూడఁ బెరుగుచున్నది. పువ్వులు చిన్నవి. పచ్చని రేకులు గలవు. దీని బెరడుతోఁ గషాయము కాచి ఔషధములలో వాడుదురు.

వలంబారిచెట్టు :— అడవులలోఁ బెరుగును. దీనికాయలు పొడుగుగా మెలిపెట్టికొనియుండును. ఈమెలి, గింజలను వెదజల్లుట కొరకు సాధనమగుచున్నది. కాయ ఎండి మెలి విడిపోవునప్పుడు లోపలి గింజలు కదలి బైటఁబడును. ఈకాయలను బోడుముచేసి ఔషధములో వాడుదురు.

బంధూకము :— వరిచేలవద్దఁ బెరుగును. ఆకులు సన్నముగాను బువ్వు లెఱ్ఱగాను నుండును,



కర్ణికారవృక్షము :—దీని ఆకులు యొక్క తొడిమ పత్రముతో నంచునందుఁ గలియక, ఆముదము, తామర యాకులయందట్లు మధ్యఁ గలియుచున్నది.

కోకోచెట్టు :—మనము కాఫీ తేయాకువలెఁ గాచి త్రాగు కోకో ఈకుటుంబపుచెట్టుయొక్క గింజలనుండి చేయుచున్నారు. కోకో చెట్లను మనదేశములో నాటి పెంపఁజూచిరిగాని విరివిగాఁ బెరుగుటలేదు. మలబారు ప్రాంతముల గొన్ని కొండలమీఁద మాత్రమీచెట్లు పెరుగుచున్నవి. వీనిని 15 అడుగుల దూరదూరముగ గింజలు నాటి పెంచెదరు. 4. 5 ఏండ్లకుఁ గాపుకువచ్చి పెక్కేండ్లు ఫలించును. కాయలు 6-9 అంగుళముల పొడుగుగానుండును. ఒక్కొకకాయలో 40 గింజలుండును. ఈగింజలను దీసి, పులియఁబెట్టి పిదప నెండఁబెట్టి వేయించెదరు. తరువాత వానిని బొడుముగొట్టి ఆపొడుములోఁ బంచదారయుఁ గొన్ని సువాసనపదార్థములను గలుపుదురు. కోకో పంట విస్తారము బెలిజియము దేశములో గలదు. అచ్చటనుండియే చాలదేశముల కెగుమతి యగుచున్నది. కాఫీ, తేయాకువలెఁ గోకోకు నిద్రబోఁగొట్టు గుణము లేదు. వానివలెఁగాక ఇది బలమునిచ్చు నాహార పదార్థము. కాని దీనిని విశేషముగ వాడినచో మలబద్ధము కలుగుటకూడఁ గలదు.

రుద్రాక్షకుటుంబము.

ఈకుటుంబపుమొక్కలు విస్తారముగ నుష్ణదేశములందుఁగలవు. ఆకులు ఒంటరిచేరిక, లఘుపత్రములు, కణుపుపుచ్ఛములు గలవు, మూఁడో, అయిదో పెద్దఈనెలున్నవి. లేఁగొమ్మలపైన మెత్తని పచ్చని రోమములుగలవు. పువ్వులుచిన్నవి. రక్షకపత్రములును, ఆకర్షణపత్రములు నైదేసి గలవు. కింజల్కములు చాలగలవు. అండాశయముక్కటి. కీలము దీనిమధ్యనుండియే బయలుదేరును. కీలాగ్రము చిన్నది. ఫలము ఎండుకాయఁగాని, లోపెంకుకాయగాని యగుచున్నది. ఈకుటుంబము బెండ, గుబ్బపు బాదముకుటుంబములనుబోలి యుండునుగాని దీనియందుఁ గింజల్కములు విడివిడిగానుండును. అవిపుట్టుచోట వృంతము కొంచము పైకి వచ్చినది. పుప్పొడితిత్తులు సన్నముగనుండును. వీనియందు రెండుగదులు గలవు.

రుద్రాక్ష:—చెట్లు మన దేశమునందుఁ బెక్కుభాగములఁ బెరుగుచున్నది. ఆకులు బల్లెపాకారము; పువ్వులు తెలుపు. దీనికాయలతో రుద్రాక్షలుచేసి తావళములను వేసికొందురు. వీనితోడనే ఈమధ్య బొత్తాములు చేయఁజూచుచున్నారు.

పేరంటకూర:—(గోనినారమొక్క) ఈ మొక్కలను బంగాళదేశమునందే పైరుచేయుచున్నారు. దీనినుండి తీసిన నారతోడనే గోనిసంచులు నేయుదురు. ఈసంచులది, జనపనారకాని, గంజాయి నారగాని, గోగునారగాని కాదు. ఈ మొక్క లించుమించు యెట్టినేలలోనైనను బైరుకాఁగలవు. రాగిడి నేలలును, ఒండ్రుమట్టి నేలలును మంచివి. ఇవి పెరుగుటకు వర్షములు సమృద్ధిగ నుండవలెను. సారవంతమగు భూములగుచో పెంటయంతగ నక్కర లేదు. పొలమును దున్ని విత్తనములను వెదజల్లుదురు. పుష్పింపక పూర్వ గోసినయెడల నార గట్టినుండదు, కాయలుగాచిన వెనుకఁ గోసినయెడల గట్టిగానే యుండును గాని ముతగగనుండును. కావునఁ బుష్పించి కాయలు కాయకపూర్వము గోయుట మంచిది.

మొక్కలను గోసినపిదప వానిపి కట్టలుగట్టి దగ్గరనున్న చెరువులోనో, నీళ్ళగుంటలోనో ఊరవేసెదరు. ఇందులకు ఉప్పునీరు పనికిరాదు, ప్రవహించుచున్న వదులుగాని కాలువలుగాని మంచివికావు, నిలుకడగనున్న నీరుమంచిది. అట్టి నీటిపైఁ గట్టలనొకదానిపై నొకటిఁచేర్చి నీటిలోమునుగునటు బరువుదేనినైనఁ బెట్టుదురు. అవిచీకి నారసులభముగ వ

చ్చుటకు శీతోష్ణస్థితిగతులను బట్టి పదిమొద లిరువది దినములవఱకుఁబట్టును: అప్పుడు కట్టలను రోకళ్ళవంటి వానితోఁ గొట్టినారనులాగి, నీటిల్లోనే గడిగి యారబెట్టుదురు నారదీయుటకు యంత్రములున్నవి గాని వానియవశ్య మంతగలేదు చీకఁబెట్టి నారదీయుటవలన నంత చేటు ఖర్చునుగాదు, మఱియు మఱలనుగొనుట మాటలతోఁ బనికాదు. డబ్బుపెట్టుబడిపెట్టుట కష్టము. నారనుశుభ్రపరచి రకములగ నేర్పరచెదరు. ఈనారతో మృదువస్త్రములును, చొక్కాలకుఁ బనికివచ్చుబట్టలును ముతగబట్టలను గోనిసంచులను నేయుచున్నారు. ఈనారతోడను, నారతోఁజేసిన వస్తువులతోడను జేయువ్యాపారమువలన మనదేశమునకు లాభమే కలుగుచున్నది.

ఈమొక్క పచ్చియాకులరసము పిండియు, ఎండాకులతోఁ గషాయముగాచియు శగరోగము, మూత్రకోశ రోగములకు నిత్తురు.

పయరు:——మొక్క అడవులలోఁ బెద్దచెట్లనానుకొని పెరుగును. ఆకులు అండాకారము అందున అంపవుపండ్లు గలవు.

అల్పయరు:——కొండలమీఁదఁ బెరుగు గుబురు మొక్క. ఆకులు బల్లెపాకారము.

పూలకి:—గుబురుమొక్క. ఆకులు బల్లెపాకారము మూడు పెద్దయీనెలున్నవి. ఆకుల కడుగువైపున రోమము లుగలవు. కణుపుపుచ్ఛములున్నవి.

మదనగింజల కుటుంబము.

ఈకుటుంబములో గుల్మములును గుబురు మొక్కలును గలవు. ఆకులు ఒంటరిచేరిక, లఘుపత్రములు సమాంచలము, కొన్నిటికిఁ గణుపుపుచ్ఛములున్నవి. పుష్పములు మిథునములు, సరాళము, రక్షకపత్రములు 5 ఉండును. కొన్నిటిలో నివి అడుగున కలసియున్నవి. మొగ్గలో అల్లుకొనియుండును. ఆకర్షణ పత్రములు 5; కొన్నిటిలో మాత్రము 4, రక్షకపత్రములు, 4 ఆకర్షణపత్రములు, గలుగుచున్నవి. ఆకర్షణపత్రములు వృంతాశ్రితములు ఇవి మెలివెట్టినట్లుండును. కింజల్కములు ఆకర్షణపత్రము లన్నియుండును. గొడ్డుకింజల్కములుకూడ గలవు. కింజల్కముల మధ్య నైదు గ్రంథికోశములున్నవి. అండాశయములో 3—5 గదులుండును. కీలములు 3—5. గింజలపై పొర తలుచుగా తెక్కలవలె వెడల్పైయుండును.

మదనగింజలు:— మొక్కలను హిందూస్థానమునందెక్కువగాఁ బెంచుచున్నారు. ఈమొక్కయు నన్నిపై రుల వ

లెనె కాయలుగాయఁగానె ఎండిపోవును. దానిగింజలను, గింజ
లనుండి తీసిన చమురును ఔషధములలో వాడుదురు. ఇవి
రెండును, అన్నిరకముల మూత్రవ్యాధులకును బనిచేయును.
మఱియు పుండ్లకుగాని నొప్పులకుఁగాని పట్టువేసినఁ దగ్గును.

అడవిగోరింట:—మొక్కయుఁ జిన్నదియె. ఇదిపడ
మటి కనుమలప్రాంతముల నెక్కువగాఁ బెరుగుచున్నది. దీ
నికొమ్మలను నీళ్ళలోనుడకఁబెట్టి ఆకషాయములోఁ గొన్ని
మందులు కలపి జిగటవిరేచనములు, అజీర్ణము, ఉబ్బుజబ్బు
లకునిత్తురు

ఆనుపత్రిలందు శస్త్రములు చేయునపుడు నొప్పి పె
ట్టకుండ రాచెడు కొకేను ఈకుటుంబములోని యొకమొ
క్క ఆకులనుండి చేయుచున్నారు, ఆమొక్కలు మనదేశ
ములో నొకటి రెండుచోట్లనే పెంచుచున్నారు కాని ద్రవ
ముతీయుట కుఁబై దేశములకే పంపుచున్నారు.

పల్లేరుకుటుంబము.

ఈకుటుంబపు మొక్కలు మనదేశములో నంతగా లే
వు. దీనిలో గుల్మములు, గుబురుమొక్కలేగాని పెద్దచెట్లు
లేవు. ఆకులు అభిముఖముచేరిక, ఒంటరిచేరిక, కూడగల
దు. వీనికి కణుపుపుచ్ఛములున్నవి. కొన్నిటిలో నివి ముం

డ్లుగా మాఱియున్నవి. మిశ్రమపత్రములు రెండుమూడు చిట్టియాకులు కలిగియుండును, కొన్ని పక్షవైఖరినున్నవి. ఒక్కొక్కకణుపునుండి ఒకటో రెండో పువ్వులు వచ్చుచున్నవి. సరాళముగాను, అసరాళముగాను గూడనుండును. ఈ పువ్వులలో తెలుపు, ఎఱుపు, పసుపు తప్ప వేఱురంగు లేదు. రక్షకపత్రములు 5, కొంచెము కలిసియుండిన నుండను. ఆకర్షణపత్రములైదు. ఇవికొన్నిటిలో మాత్రము లేవు. పువ్వులో పళ్లెరము గలుగుచున్నది. కింజల్కములు, ఆకర్షణ పత్రములన్నిగాని, వానికి రెండు మూడు రెట్లుగాని యున్నవి. ఇవి ఆకర్షణపత్రముల నంటియున్నవి. కింజల్కముల కాడలమీఁదఁ బొలుసుకూడ గలదు. అండాశయము ఉచ్చము. నాలుగైదు గదులుండును.

పల్లేరుమొక్క:—గడ్డి పెరుగు ప్రతిచోటను బెరుగ గలదు. అదినేలమీఁదనే బడియుండి గడ్డిలోఁగలసి మనకు గోచరము కాదుగాని, ముళ్ళుగ్రుచ్చుకొనుటవలన నదియున్నట్లప్పుడు గ్రహింతుము. ఆముళ్ళు కాయలకున్నవి. మనకట్లు గ్రుచ్చుకొనుటవలన దానికి లాభమే గలుగుచున్నది. కాయలమీఁదముండ్లును అట్లుగ్రుచ్చుకొనుటకే యేర్పడుచున్నవి. మనకాలిలో గ్రుచ్చుకొనినమొదలఁ దీసి దూరముగ వి

సరివేతుము. ఇవియే దానికిఁగావలసినది. కాయ అచ్చటఁబడి మొలచును. ఈరీతినే అవివ్యాపించును. ఉత్తరేణికాయలు మనబట్టలకును, గొఱ్ఱెలు మొదలగువాని శరీరమునకు నంటుకొని వ్యాపించునట్లు నివియు వ్యాపించుచున్నవి.

ఎండుకాయలకషాయమును, పచ్చియాకుల రసమును మూత్రవిసర్జనమప్పుడు కలుగుమంట శుక్లనష్టము మొదలగుబాధల నివారించుటకు వాడుదురు.

బిలిబిలికాయ కుటుంబము.

ఈకుటుంబములోఁ జాలభాగమన్నియు గుల్మములే. ఆకులకు కణుపుపుచ్ఛములుండును. ఒంటరిచేరిక, లఘుపత్రములును మిశ్రమపత్రములును గూడగలవు. వానిపై రోమముండును. పుష్పములు సాధారణముగ సరాళముగానే యుండును. పుష్పమునందుఁ బత్రివలయమునందును నైదేసికలవు. అయిదు రక్షకపత్రములు, అయిదు ఆకర్షణపత్రములు, వలయమున కైదు కింజల్కములచొప్పున రెండువరుసలును అండాశయమునందు నైదుగదులు, అయిదు కీలములును గలవు. కాయ ఎండుకాయ పెక్కువానియందు, విచ్చెడుకాయ.

బిలిబిలి:—చెట్టును దోఁటలందుఁ బెంచుచున్నారు. దీనిపండ్లు మందులో నుపయోగపడుచున్నవి. పండ్లరసముదీసి పంచదారయు నీళ్ళునుగలపి సన్ననిమంటమీఁదఁ జిక్కఁబడువరకుఁ గాచి, ఇత్తురు. మూలశంకకును, రక్తవిరేచనములకును గుణమిచ్చును.

తామర్త:—చెట్టును దోఁటలందుఁ బెంచుచున్నారు. వీని కింజల్కము లడుగున కలసియున్నవి. దీనికాయలుగూడ మూలశంకకు గుణమిచ్చును.

పులిచింతాకు:—మొక్క నీటివార నేలమీఁదఁ బ్రాకుచుండును. ఆకులలో మూడేసి చిట్టియాకులున్నవి. దీనియాకులునీళ్లతోఁగలిపి కాచి, వాచి పొక్కులెక్కినచోట్లను బట్టువేసినయెడలఁ దగ్గును. ఆకులతోఁగూరవండి తినిన అన్నహితవును గలుగును.

నీరుగన్నేరు:—మంచినీళ్ళ తీరమునఁ బెరుగును. ఆకులకుఁ దొడిమలేదు; లఘుపత్రములు. పువ్వు లనరాళముగ నుండును; కాని చాల అందముగనుండును.

నారింజకుటుంబము-

నారింజచెట్లు మనదేశములోఁ బలుచోట్లనే పెరుగుచున్నవి.
ఇది చిన్నచెట్టు- కొమ్మలమీఁద ముండ్లున్నవి.
ఆకులు:—ఒంటరిచేరిక. లఘుపత్రమువలెనున్న మిశ్రమపత్రములు;

పత్రము మొదట నొక అతుకు కలదు. ఆయతుకు వద్దకు దానిని సరిగా విరువవచ్చును లఘుపత్రమైనచో నిట్లతుకుండదు. ఇది మిశ్రమపత్రముగాఁ బుట్టవలసినది. చిక్కుడాకులో మూడు చిట్టియాకులున్నవి గదా! వానిలో మధ్యగానున్న చిట్టియాకు నుంచి, ప్రక్కనున్న రెండింటిని త్రుంపివేయ నెట్లుండునో, అట్లే నారింజఆకున్నది. తొడిమ ఇరుప్రక్కల వెడలుపైయున్నది. ఆ వెడలుపై తొడిమ రెక్కల వలెనున్న భాగముకూడ ఆకులవలెఁ బనిచేయును. పత్రము సమగోళాకారము. సమాంచలము; దట్టముగానున్నది. దానిలో గ్రంథికణములుండుటచే వాసన గలదు.

పుష్పమంజరి:—కణుపు సందులందుండి మధ్యారంభ మంజరులు. పుష్పములు సరాళము. సంపూర్ణము.

పుష్పకోశము:—సంయుక్తము. గిన్నెవలెనున్నది. నీచము.

దళవలయము:—అసంయుక్తము. 5 ఆకుపచ్చనిపత్రములు. తెల్లగా నుండును. మంచివాసన గలదు.

కింజల్కములు:—అసంఖ్యములు. కాడలు పొడుగు. పుప్పొడితిత్తులు రెండుగదులు. కింజల్కములమధ్య పళ్ళెరము గలదు.

అండకోశము:—అండాశయము ఉచ్చము. పలుగదులు గలవు. కీలము ఒకటి. లావుగనున్నది. కీలాగ్రముగుండ్రము. ఫలముకండకాయ.

ఈకుటుంబములోని చెట్లమీఁద ముండ్లుగలవు. ఆకులు ఒంటరిచేరిక, మిశ్రమపత్రములు కొన్నిటిలో ఒక్కటియే చిట్టియాకుగలదు. ఆకులకు సువాసన గలదు. పుష్పములు సరాళములు సంపూర్ణము. పుష్పకోశము సంయుక్తము.

ఆకర్షణ పత్త్రములైదు. కింజల్కములు పదియో అంతకంటె నెక్కువగానో యున్నవి. అండాశయమునందు గదులు చాలగలవు. ఫలము కండకాయ.

నారింజచెట్లు :—ఉష్ణ ప్రదేశములలోఁ బెరుగును. ఇవిమనదేశములో చాలచోట్లనే పెరుగుచున్నవిగాని వీనికంటెఁ గమలాఫలపుచెట్లు నెక్కువ శ్రద్ధతో పైరుచేయుదురు. ఇవియు, బత్తాయినారింజయు వేఱు వేఱు తెగలు, వీనిలో మనము తిను ముత్యములు కాయ ముదరనప్పుడు, అండాశయములో రోమములవలెఁ గనుపట్టును.

కమలాఫలపు గింజలను మళ్ళలోనాటి మొక్కలు ఒకటి రెండడుగు లెదుగఁగానె తీసి దూరదూరముగఁ బాతుదురు. ఏడెనిమిది సంవత్సరములు వచ్చిన తరువాత కాయుట కారంభించును. ఇవినాగపూరు ప్రాంతముల సంవత్సరమునకు రెండుకాపులు గాయుచున్నవి.

బత్తాయినారింజ :—చెట్లను నిల్పి పెంతురు. వీనివండ్లు మిగిలినవానికంటె చాల నారోగ్యము. నారింజచెట్ల పువ్వులను, పండ్లచర్మములను ఔషధములలో వాడుదురు.

ఈడి :—పండ్లు కమలాఫలముల రంగుగ నిమ్మకా యలంత నుండును. ఇవియు రుచిగానే యుండునుగాని, పండ్లు చిన్నవగుటచే నెవరు పెంచుటలేదు. మన్యములందు మాత్రి మా చెట్లు పెరుగుచున్నవి.

నిమ్మ :—చెట్లు చాలచోట్లనే పెరుగుచున్నవి నిమ్మ కాయలను సదా వాడుచున్నాము. వానియందు పులుపేకాక ఒకసువాసనకూడ గలదు. నిమ్మపండ్ల చర్మముకూడ ఔ షధములలో వాడుదురు.

దబ్బ, నారదబ్బ :—చెట్లనుగూడ కొన్నిచోట్ల పైరు చేయుచున్నారు. వీనిపండ్లు తినుటకు బాగుండవు. దబ్బాకులు సువాసనకై మజ్జిగలో వేసికొందుము.

పంపరపనాస:—పండు వీనియన్నిటికంటెను పెద్దది. కొన్నిపండ్ల తొనలు ఎఱ్ఱగాను, కొన్నిటివి తెల్లగాను నుండు ను. ఈచెట్లు దసరాపండుగనాటికి నిండుకాపులో నుండును.

మాదీఫలపు చెట్లను కొన్నిచోట్ల పైరుచేయుచు న్నారు. ఈపండ్లు తినుట కేమియు బాగుండవు. కాని వీని

చర్మమును, రసమును ఔషధములలో వాడుదురు. వీనికి అ జీర్ణము, దానివలన గలుగు కడుపునొప్పి మొదలగువానిని బోగొట్టుగుణము కలదు.

వెలగ:—చెట్లు మనదేశమునందంతటను పెరుగుచున్నవి. వీనికొమ్మలమీఁద ఆకులు గుత్తులు గుత్తులుగాఁ బెరుగుచున్నవి. వానిలోఁ జాలయాకులు ఒకదాని కణుపు సందులోనున్నవి. అవి ఆ కణుపునందులో బెదుగవలసిన కొమ్మమీఁద, కొమ్మ పెరుగ లేదుగాని ఆకులు మాత్రము పెరుగుచున్నవి. పుష్పములలోఁ గొన్ని మిథున పుష్పములు, కొన్ని స్త్రీపుష్పములు కొన్ని పురుషపుష్పములు. కింజల్కములు అడుగున కలసియున్నవి. కీలము లేదు. ఈచెట్లనుండి ఒక జిగురు వచ్చుచున్నది ఆజిగురును, ఆకులను, పండ్లను గూడ ఔషధములలో వాడుదురు. ఇవి అజీర్ణమునకును జ్వరముచే గలుగు దాహము నడచుటకును కడుపునొప్పులకును బనిచేయును. పండ్లలోనిగుంజును నీళ్ళలోఁగలపి, ఆనీరును వడబోసి. అందులో పంచదార వేసి పుచ్చుకొందురు. వెలగ జిగురన కెక్కువధరగలదు. కావున తుమ్మజిగురును కల్తి కలుపుచుందురు. కాని వెలగజిగు రెక్కువ తెల్లగను ఎక్కువనిర్మలముగను నుండును గావున, ఆ రెండింటి భేదము కనిపెట్టవచ్చును.

మారేడు:—చెట్లు విశేషముగాఁ గొండప్రదేశములోఁ బెరుగుచున్నవి. ఆకులు మూఁడేసి చిట్టియాకులున్న మిశ్రితపత్రములు. పువ్వులు తెల్లగాను బెద్దవిగాను నున్నవి. ఈచెట్లు వేసవికాలమందు పుష్పించుట నారంభించి వర్షములు ముగియునాటికి ఫలించును. కాయలలో పదునైదు గదులవఱకుఁ గలవు. గదులలో గింజలేగాక జిగురువంటి పదార్థమొకటి గలదు. దీనిపత్రము లీశ్వరునకుఁ బ్రీతియని వీనితోఁ బూజచేయుదుము. కొందఱు వీనిపండ్లను తిందురు. పచ్చికాయల నూరగాయ వేసికొందురు. దీనికాయలలో గింజలవద్ద నున్న జిగురునుగొందఱు గచ్చుచేయుటలోనుపయోగింతురు. కొందఱు కాయలను వెచ్చబెట్టి జిగురుతీసి రాసుకొని స్నానముచేయుదురు. వేళ్ళబెరడును, అకులరసమును ఔషధములలో వాడుదురు. కాయలను దొలచి పొడుముకాయలుచేయుచురు. కాయలు చిన్నచిన్నవిగా నున్నప్పుడు రుద్రాక్షలవలె దండ గ్రుచ్చివేసికొందురు. ఈచెట్టుకలప అంత శ్రేష్ఠమైనదిగాదు. త్వరగాఁ బురుగుపట్టును. అయినను నాగళ్ళు మొదలగునవి చేయవచ్చును. దువ్వెన్నలు, లక్క పిడతలుకూడ చేయుచున్నారు.

కొండకసింత :—చెట్లు కొండలమీఁద చిన్నగుబురు చెట్లుగాఁ బెరుగుచున్నవి. వీనిమీఁద ముళ్ళు ఎక్కువగాఁగలవు. దీనివేరు బెరడు మన్యపుజ్వరములకును అగియాగి, రెండుదినముల కొకమాఱు, మూఁడుదినముల కొకమాఱు, ఈరీతిగా వచ్చుజ్వరములకు మంచిది. ఆబెరడుతో కషాయముగాచి పుచ్చుకొనినయెడల శరీరము నొప్పులుకూడ తగ్గును. ఇది క్వైనైను కంటె తక్కువపని చేయునని చెప్పలేము.

కరివేపచెట్టు:—మనదేశమునందంతటను బెరుగుచున్నది. అది రాతినేలలందెక్కువగాఁ బెరుగును, ఆకులు సువాసనగనుండుటచే కూరగాయలందువాడుచున్నాము.

అరుడు చెట్టు:—ఆకులుఔషధములోనికిఁబనికివచ్చును గాన తోఁటలందు పెంచుచున్నారు. ఆకులు మిశ్రమపత్రములు. వీనితోఁ గషాయముగాచి అజీర్ణము మొదలగు కొన్నిరోగములకిత్తురు. దీనికి పసిబాలచిన్నెవంటి జబ్బులనుగూడఁ బోగొట్టుగుణము కలదందురు.

సీమగోరింట:—చెట్లు విస్తారముగ కాశ్మీరదేశమునందుఁ బెరుగుచున్నవి. వీనిగింజలను ఔషధములలో వాడుదురు. ఇవి గోరింటగింజలవలెనే యుండును. ఈగింజలపొడిని ఉబ్బనపుదగ్గు, కీళ్ళునొప్పులు, మూర్ఛ, మూత్రవ్యాధులు, మొదలగు జబ్బులకు నిత్తురు.



నాగగోలుగు.

నాగగోలుగు:—చిన్నచెట్టు, పువ్వులు తెల్లగాను సువాసనగాను నుండును.

మద్దిపాలుకుటుంబము.

ఈకుటుంబములో గుల్మములులేవు. గుబురుమొక్కలును జెట్లును మాత్రము గలవు. వీనిబెరడు చేదుగానుండును. ఆకులు పెద్దవి, ఒంటరిచేరిక, కొన్నిటిలో లఘుపత్రములును గొన్నిటిలోఁ బక్షవైఖరినున్న మిశ్రిమపత్రిములును

గలుగుచున్నవి. పువ్వులు సరాళము. పుష్పకోశమునకు 3-5 తమ్మెలుగలవు. అవి అల్లుకొనినవైనను, తాకుచున్నైన నుండును. ఆకర్షణపత్రములు 3-5. ఇవియు మొగ్గలోఁ బుష్పకోశపు తమ్మెలుండినట్లేయుండును. కింజల్కములు, ఆకర్షణపత్రములన్నిగాని, అంతకు రెట్టింపుగాని యుండును. కొన్నిటిలో మాత్రము అసంఖ్యములుగానున్నవి. కాడల కడుగున నొకపాలుసుండినసుండును. పుష్పాడితిత్తులు నిడివిచౌకపునాకారము. అండాశయములో నండము ఒకటియే యుండును.

మద్దిపాలు చెట్టుబెరడును ఔషధములలో వాడుదురు. ఈచెట్లనుండి గుగ్గిలమువంటి పదార్థమొకటి వచ్చును. బెరడునకంటె నిదియే మంచిపనిచేయును. ఇదినీళ్ళలోఁగలుగదు. కొన్నిద్రావకములలోఁగలపి మూత్రవ్యాధులు, శెగ దగ్గు, జిగటవిరేచనములు మొదలగు జబ్బులకిత్తురు.

గారచెట్టు—రాతినేలలందుఁ బెరుగును. దీనిపండు గుంజు కాకిమఱ్ఱిపండువలెనే చర్మవ్యాధులకుఁ బనిచేయును.

మైసాక్షికుటుంబము.

ఈకుటుంబమునందుఁ జెట్లును గుబురు మొక్కలును గలవు. ఆకులు, ఒంటరిచేరిక, మిశ్రమపత్రములు మూడే

సిచిట్టియాకులు గలిసినైనను, విషమభిన్నముగఁ బత్రవైఖరినైన నుండును. పువ్వులు చిన్నవి. సరాళము మిథునపుష్పములు ఏకలింగ పుష్పములు కూడఁ గలవు. పుష్పకోశమునకు 3-6 తమ్మెలుండును. ఇవి మొగ్గలో నల్లుకొనియైనను ఒకదానినొకటి తాకుచునైన నుండును. ఆకర్షణపత్రములు 3-6 గలవు. కొన్నిటిలోమాత్ర మడుగునఁ గలసియున్నవి. కింజల్కములు ఆకర్షణపత్రములన్నియో అంతకు రెండురెట్లోయుండును. కొన్నిటిలో నివియన్నియు సమముగాలేవు. అండాశయములో 2-5 గదులున్నవి. సాధారణముగ రెండేసి అండములుండును. స్తంభసంయోగము. ఫలము ఎండుకాయ, పగులదు.

మైసాక్షి చెట్లు హిందూస్థానమునందెక్కువగాఁ బెరుగుచున్నవి. శీతకాలమందు వానిమీఁద నాట్లుపెట్టిన యెడల జిగురువంటిపదార్థము వచ్చును. అది పరిశుభ్రముగానున్న యెడలఁ గొంచముపచ్చగానుండును, దీనినౌషధములలో వాడుదురు. ఇదిమిక్కిలి చేదుగానుండును గాన లోపలకు పుచ్చుకొనలేరు. కడుపు ఉబ్బుట ఎక్కిళ్ళు మొదలగువానికి, దేహముపైన రాతురు. అదిశరీరమును గట్టిగానంటుకొనును.

బాలింతబోలము:—చెట్లు మనదేశములో నంతగా లేవు- ఈచెట్లనుండియుజిగురువంటిపదార్థము వచ్చును. దీనిని ఔషధములలో వాడుదురు.

నల్లరోజను:—చెట్లు పడమటికనుమలదగ్గర నెక్కువగాఁ బెరుగుచున్నవి. వీనినుండివచ్చు జిగురువంటి పదార్థముతో దగ్గుమొదలగువానికి, గుండెలుమీఁద పట్లు వేయుదురు.

ఫరంగి సాంబ్రాణి:—చెట్టు కొండలమీఁదఁ బెరుగును. దీనినుండియు జిగురువచ్చును. దీనిని పొడుముగొట్టి పంచదారకలపి నీళ్ళలోవేసి పుచ్చుకొనవచ్చును. అజీర్ణవిరేచనము మొదలగునవి కట్టును. ఈపొడిని మంచినూనెలోనైనను, గసగసాలనూనెలోనైనను, గలిపికాచి, వడగట్టి, తలకురాచుకొనుచున్న యెడలఁ దలవెండ్రుకలు పెరుగును.

అందుగపిసను:—చెట్టును పైదానివలెనే యుండును. ఈపదార్థమున కొకవిధమగు సువాసనగలదు. దీనిని గుగ్గిలము సాంబ్రాణి పొగవేసినట్లు పొగవేయుదురు. ఈచెట్టు కలప గట్టిగానే యుండును. దీనితో తఱుచుగా తేయాకుఁ బెట్టుటకుఁ బెట్టెలు చేయుదురు. వంటచెఱుకుగాఁ గూడ బాగుండును.

వేపకుటుంబము.

వేపచెట్టు మనదేశమందంతటను బెరుగుచున్నది.

ఆకులు—ఒంటరిచేరిక, కణుపుపుచ్ఛములులేవు, మిశ్రిమపత్రిములు, పక్షవైఖరి, విషమభిన్నము, చిట్టియాకులు బల్లెపునాకారము, మొదలువంకరగానుండును. కొన వాలనుగలదు. అంచున అంపపుపండ్లున్నవి. రెండువైపుల నున్నగ నుండును.

పుష్పమంజరి:—కణుపు సందులనుండి రెమ్మగెలలు పువ్వులిచిన్నవి.

పుష్పకోశము:—సంయుక్తము 5 తమ్మెలుగలవు, తమ్మెకొన గుండ్రిముగనుండును నీచము.

దళవలయము—ఆకర్షణపత్రికలు 5, నిడివిచాకపు వాకారము.

కింజల్కములు:—కాఁడలన్నియుఁ గలసి యొకగొట్టమువలె నేర్పడియున్నవి. ఈగొట్టములోపలివైపున పుప్పొడితిత్తులున్నవి.

అండకోశము:—అండాశయము, ఉచ్చము. 3 గదులు. అండాశయముచుట్టుఁ బళ్ళెరముగలదు. కీలము ఒకటి, సన్నముగానుండును. ఫలము లోపెంకుకాయ.

ఈకుటుంబములో విస్తారము వృక్షములే గలవు. ఆకులకుఁ గణుపుపుచ్ఛము లుండవు. ఒంటరిచేరిక, సాధారణముగఁ బక్షవైఖరిగ నుండును. చిట్టియాకుల మొదలు

వంకరగానుండును. పుష్పములు చిన్నవి. రక్షకపత్రములు, ఆకర్షణపత్రములు, అయిదేసి కలవు. అవి కలసియైనను విడివిడిగానైనను నుండును. కింజల్కపు కాఁడలన్నియుఁ గలసి ఒకగొట్టమువలె నేర్పడును. ఈగొట్టముయొక్క లోపలి వైపుననే పుప్పొడి తిత్తులు గలవు. అండాశయము చుట్టుఁ బల్లెరము గలదు. అండాశయములోఁ దఱుచుగా నైదు గదులుండును.

వేపచెట్టు:—మిక్కిలి యుపయోగమయినది. ఆకులు పువ్వులు కాయలు గింజలు, వేరులు అన్నియు నౌషధములలోఁ బనికివచ్చును. చెట్టు బెరడును, వేరుబెరడును లేఁతకాయలును కొన్నిజ్వరములకు మంచిపని చేయును. వేపనూనె చర్మవ్యాధులకు మంచిది. ఆకుల కషాయముతో పుండ్లు కడుగవచ్చును. స్ఫోటకము మొదలగు వానికిని ఆకుల రసమును బూయుటమంచిది. పువ్వులు అజీర్ణమునకును నీరసమునకును బనిచేయును. మఱియు వేప "కల్లు" క్షయకును, కుష్టునకును గూడ మంచిపని చేయును. ఈకల్లు ఒక్కొక్కప్పుడు చెట్టుచివరనుండి స్రవించును. ఇట్టిదానినే తీయుటకు చెట్టుమొదటఁ గొంత త్రవ్వి మంచి వేరుమీఁద నాటుపెట్టి దానిక్రింద నొక పాత్రను బెట్టుదురు. దీనిలోనికి రసము దిగును. వేపకలపయు మిక్కిలి గట్టిగానుండును. బళ్ళు, నా

గళ్ళు, పడవలు మొదలగునవి చేయుదురు. వేపచెట్లు గాలిని శుభ్రిపరచును. అది ఎక్కువగా నున్నచోట్ల "కలరా" తక్కువగా నున్నది. ఇవి చల్లని నీడనిచ్చును.

తురకవేప:—చెట్లును బెద్దవియె. వీని యాకులు ద్విభిన్నముగను త్రిభిన్నముగను గూడ నుండును. దీనివేరు, బెరడు గింజలనుగూడ కొందఱౌషధములలో వాడుదురు. దీనిగింజలతో తావళమును జేయుదురు.

బిళ్ళుచెట్టు:—రాతినేల లందుఁ బెరుగును. ఆకులు పక్షవై ఖరి. చిట్టియాకు లిఱువది జతల వఱకునుండును. దీని కలప చాల బాగుండును.

గారుగు:—చెట్టు మిక్కిలి పెద్దది. వేసవికాలమందుఁ బుష్పించును. దీనికాయలను తిందురు.

వల్లరసి:—పెద్దచెట్టు. శీతకాలమునందుఁ బుష్పించును. దీనిబెరడునుజాల చేపలుండు నెచ్చటనైనను వేసినచోనవి పైకితేలి త్వరగాఁ బట్టువడును. కలపయు బాగుండును.

చిన్నవల్లరసి:—కొండలవద్దఁ బెరుగు చిన్నచెట్టు. ఆకులకు పమూడేసి చిట్టియాకులున్నవి.

మాల్కుంగుని కుటుంబము.

ఈచిన్నకుటుంబములోఁ జెట్లు గుబురు మొక్కలు గలవు. ఆకులు ఒంటరిచేరికగానైనను, అభిముఖచేరికగానైన నుండును. అవిమట్టిమాకులవలె బిరుసుగానున్నవి. పువ్వులలో మిథునపుష్పములు, ఏకలింగపుష్పములు కూడఁగలుగుచున్నవి. పుష్పకోశముచిన్నది. నాలుగైదు తమ్మెలు అల్లుకొని యుండును. కాయ నంటుకొని పుష్పకోశము స్థిరముగా నుండును. ఆకర్షణ పత్రములును నాలుగో అయిదో యుండును. కొన్నిటిలో లేకపోవుటయుఁగలదు ఇవియు నల్లుకొనియే యుండును : కొన్నిటిలోఁ బళ్ళెరమునంటియున్నవి. కింజల్కములు 3 మొ. 5. కాఁడలు వెడల్పుగానుండును. అండాశయములో గదులు 3 మొ. 5 వఱకుఁగలవు. ఒక్కొక దానిలో రెండేసి అండములుండును. కీలము పొట్టిగానుండును. గొన్నిటిలో లేనే లేదు. కీలాగ్రము త్రిభుజాకారము.

మాల్కుంగుని :—మొక్క దేనినైన ఆనుకొని పాదవలెఁ బెరుగును. ఆకులు అండాకారము. పువ్వులు చిన్నవి, పచ్చగానుండును. దీనిగింజలనుండి తీసిన చమురును నౌషధములలో నుపయోగించుదురు. ఉబ్బుజబ్బులకది గుణమిచ్చ



మాలాకంగుని. (పుష్పములు, ఫలములు)

చ్చును. మఱియు గింజలలోను, నూనెలోను గూడ జ్ఞాపకశక్తి నెక్కువ చేసెడు గుణము గలదు.

చిన్నచింటు :—పొదవలెఁ బెరుగును. గట్టిముండ్లు గలవు. పువ్వులు లేఁత పసుపురంగు ఇదికంచలుగాను, ఎండిన పిదపఁ బొయిలోనికిఁ దప్ప, మఱెందులకును బనికిరాదు.

పెద్దచింటు :—చిన్నచెట్టు. దీనికిని ముండ్లుగలవు. ముండ్లమీఁద ఆకులు పువ్వులు గలవు, కావున నవి కొమ్మ లు మారుటచే నేర్పడినవని భావింపవలసియున్నది. దీనిపువ్వ లు తెల్లగానుండును.

నీరజ :—చిన్నచెట్టు. ముండ్లులేవు. ఆకులు అభిముఖ చేరిక. పువ్వులు చిన్నవి. పసుపుగలిసిన ఆకు పచ్చరంగుగా నుండును.

రేగుకుటుంబము.

రేగు కుటుంబపు మొక్కలు ప్రపంచమునందంతట ను గలవు. ఈకుటుంబములోఁ బెద్దచెట్లును గుబురు మొక్క లును నున్నవి. చాలవానికి ముండ్లుగలవు. ఈముండ్లు కణు వు పుచ్ఛములు మాఱుటచేఁ గలిగినవి. కొన్నిమొక్కలీము శ్నసాయమునఁబెద్దచెట్లపై నెగఁబ్రాకును. ఆకులు ఒంటరి చేరిక, లఘుపత్రములు, కొంచము దట్టముగను బిఱుసుగ ను నుండును. పువ్వులు చిన్నవి. కణుపుసందులనుండి మధ్యా రంభ మంజరులుగఁ బుట్టుచున్నవి. అయిదు రక్షకపత్రము లును అయిదు కింజల్కములు గలవు. ఈకింజల్కములు ఆక ర్షణపత్రముల కెదురుగా నుండును. కింజల్కముల మధ్యఁ

బళ్ళెరము గలదు. సాధారణముగ నండాశయమునందు మూడు గదులుండును. కొన్నిటికాయలు ఎండుకాయలు, కొన్ని కండకాయలు.

రేగుచెట్టు:—మన దేశము నందంతటను బెరుగు చున్నది. దీని యాకులకు మూడు పెద్దఈనెలుగలవు. అండాశయమున రెండు గదులు మాత్రమున్నవి. ఈచెట్లలో రెండు మూడు రకములు గలవు. కొన్నిటిపండ్లు పెద్దవిగను, కొన్నిటివి చిన్నవిగను, కొన్నిటివి కోలగను నుండును. కోలగనున్నవే యెక్కువరుచిగా నుండునందురు ఈచెట్టు. బెరడును జర్మములు బాగుచేయుటలోను నీలిమందు చేయుటలోను వాడుదురు. పండ్లును ఔషధములలో నుపయోగింతురు. పెద్ద చెట్ల కలపయుఁ బెట్టెలు మొదలగుపని చేయుటకు బాగుండును.

రక్తవల్లి:—(సురలతీఁగె) చెట్లపై నెగఁబ్రాకెడు పెద్దతీఁగె. ఆకులు తీఁగెకు రెండువైఁపులనేయుండును. అంచున అంపపు పండ్లు గలవు. పువ్వులుచిన్నవి. ఘాటగు వాసన గలదు. దీనివేరుబెరడు ఔషధములలో వాడుదురు. కొన్ని జ్వరములకుఁ జర్మవ్యాధులకు, నీరసమునకును బనిచేయునన్న

పారకి:—పెద్దతీఁగె. ఆకులపైనెత్తుగ మెత్తని రోమములు గలవు. పువ్వులకుతొడిమలులేవు. కాయనల్లగ నుండును. దీనిని తినవచ్చును.

గోటి:—చిన్నచెట్టు. ఆకులు కొంచము గుండ్రముగ నుండును. అంచున సన్నని అంపపువండ్లుగలవు. వానిపై మెత్తనిరోమములు గలవు. దీనికలప నారింజరంగుగను గట్టిగాను నుండును.

ద్రాక్షకుటుంబము.

ఇది యొకచిన్నకుటుంబము. ఇందులోని మొక్కలు చాలభాగము నులితీఁగెలమూలమునఁ బ్రాకునవియె. ఈ నులితీఁగె లాకుల కెదురుగనున్నవి. ఇవి ప్రకాండము యొక్క మారురూపములుగాని యాకులయొక్క మారురూపములు గావు. ప్రకాండము పలకలుగానుండును. ఆకులు ఒంటరిచేరిక, లఘుపత్రములు. వృంతముమీఁదను గొన్నిటిలో నులితీఁగెలుగలవు. అది పూర్తిగ నట్లుమారుటయుగలదు. పుష్పములు మిథునములేకాని, కొన్నిటిలో మాత్ర మేకలింగ పుష్పములున్నవి. ఆకర్షణపత్రములు నాలుగో, అయిదో యున్నవి. అవిమొగ్గలో నొకదానినొకటి తాకుచుండును. కింజల్కములు ఆకర్షణపత్రము లెన్నిగలవో, అన్నియే యున్న

వి. ఇవివానికెదురుగానుండును. వీనిమధ్యనొక పళ్ళెరము కూడగలదు. అండాశయమునందు గదులు ఆఱువఱకు గలుగుచుండును. కొన్నిటిలో కీలముపొట్టిగానున్నది. కొన్నిటిలో నదిలేదు. ఫలము, కండకాయ.


ద్రాక్ష.

ద్రాక్షతీఁగెలు:—విరివిగా శీతలదేశములలోఁ బెరుగును, వానికి తేమగాలికూడదు. చెన్నరాజ్యమునందు వానిపంట మిక్కిలి తక్కువ మనదేశముయొక్క యితరభాగములలో నచ్చటచ్చటఁ బెంచుచున్నారు. ద్రాక్షపండ్లలోఁ జాలరకములు గలవు. తీఁగెలను విత్తులమూలమునఁ గాక, కొమ్మలను గోసి, వానిసిపాతియే పైరుచేసెదరు. ఒక యడుగు పొడుగుగానున్నకొమ్మమీఁద సుమారు నాలుగైదు మొగ్గలుండవచ్చును. కొమ్మలను అడ్డముగాఁ బాతినతరువాతఆమొగ్గలే మొక్కలుగావచ్చును. అవి సుమారు తొమ్మిదంగుళములెత్తుగా నున్నప్పుడువానినిదీసి, జనుములో దమ్ముచేసి, ఎఱువువేసిన తోఁటలలోఁ బాతుదురు. వానికి నాలుగైదు దినములకొకమారు నీళ్ళుపోయుదురు. ఎదిగెడుతీఁగెలుప్రాఁకుటకు దగ్గరనేమైన పాతవలెను. తఱుచుగా బాడిదకొ

మ్మలను బాతుచున్నారు. 5 అడుగులెత్తు ఎదిగినతరువాత తీఁ
గెలచివరను కత్తిరింతురు. అందుచే ప్రక్కలనుండి కొమ్మ
లు బయలుదేరును. వీనిలోఁ గొన్నిటినిమాత్రముంచి మిగి
లిన వానిని కత్తిరించివైతురు. కత్తిరించిన నాలుగైదు వార
ములకు పువ్వులుపూసి కాయలుకాయ నారంభించును. పూ
సినప్పటినుండియు నీరుపోయవలెను.

అంగళ్ళయందు అమ్ము కిసిమిసిపండ్లు ద్రాక్షపండు
వేరువేరు రకములు. ఈపండ్లను ఔషధములో వాడుచున్నా
రు. వీనినుండి సారాయి బ్రాందినిగూడఁ దీయుదురు.

నల్లేరు:—చెట్టుమీఁద బ్రాకుచుండును. దీనికిని ను
లితీఁగలు గలవు. ప్రకాండము ఆకుపచ్చగనున్నది. లేఁత కొ
మ్మలను ముక్కలు ముక్కలుగాఁ గోసి, ఎండబెట్టి నీళ్ళలోఁ
గాచి ఆముక్కలను రెండుమూడుమారులు సున్నపునీళ్ళలోఁ
గూడ కాచుదురు. అప్పటికి వానిదురద పోవును. ఆముక్కల
ను బంచదారనీళ్ళలోఁ గలపి, అజీర్ణమును బోఁగొట్టుటకునిత్తు
రు. కొన్నిజబ్బులకు నల్లేరుతో వడియములుబెట్టి వానిని అ
న్నములోఁ గలుపుకొని తిందురు.

బజ్జీబచ్చల:—చాలచోట్లనే పెరుగుచున్నది. దీని ఆ
కులనుగాచి కురుపులకు త్వరగా చితుకుటకు కట్టువేయుదురు.

మాంరాటతీఁగె:—అడవులలోఁ జెట్లమీఁద ప్రాకు చుండును. ఆకులకు కణుపుపుచ్ఛములు గలవు ఎఱ్ఱని చిన్న చిన్నపువ్వులు పూయును.

కనపతీఁగె:—బల్లబరుపుగా నుండును. పువ్వులు తెలుపు.

కుంకుడు కుటుంబము.

కుంకుడుచెట్లు మనదేశములోఁ జాలచోట్లఁ బెరుగుచున్నవి.

ఆకులు:—మిశ్రిమపత్రిములు. ఒంటరి చేరిక కణుపుపుచ్ఛములు లే వు. చిట్టియాకులు మూడో, నాల్గో, అయిదో యుండును. సమాంచలము. విషమరేఖపత్రిము. దట్టముగాను బిరుసుగాను నుండును. కొనసన్నము. ఒక్కొక్కప్పుడు ఖనితము.

పుష్పమంజరి:—కొమ్మలచివరలనుండి రెమ్మగెలలు. తెల్లని చిన్న పువ్వులు. చేటికలు గలవు. పువ్వులకు వాసనలేదు.

పుష్పకోశము:—రక్షక పత్రిములు 5 సమముగా నుండును. నీచము.

దళవలయము:— 5 ఆకర్షణపత్రిములు. సమముగానుండును. వీని పైన రోమములుగలవు.

కింజల్కములు :—8 పొట్టివి. కాడలయడుగున రోమములు గలవు. పుష్పాడి తిత్తులు 2 గదులు. కింజల్కములచుట్టు పళ్లెరము గలదు.